RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 15 ఆదివారం 9 ఫిబ్రవరి 2025 పేజీలు : 4

### భారత సరిహద్దుల్లో బంగ్లాదేశ్ డ్రోన్స్...

భారత్, బంగ్లాదేశ్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు క్రమంగా పెరుగుతున్నాయి. అందుకు బంగ్లాదేశ్ ఆర్మీ పశ్చిమ బెంగాల్ సరిహద్దుల్లో బైరక్టార్ TB-2 కిల్లర్ డ్రోన్‌ను మోహరించడమేనని చెప్పవచ్చు. బంగ్లాదేశ్ ఆర్మీ మోహరింపుతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత పెరిగింది. ఈ ప్రాంతం భారతదేశంలో చాలా సున్నితమైనదిగా పరిగణించబడుతుంది. టర్కియే TB-2 డ్రోన్ చాలా శక్తివంతమైనది. ఇది దాడి చేయడమే కాకుండా, గూఢచర్యం చేయడంలో కూడా సహాయపడుతుంది. దీంతో ఇరు దేశాల మధ్య పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ఈ డ్రోన్‌లను బంగ్లాదేశ్‌లో 67వ సైన్యం నిఘా కార్యకలాపాల కోసం వినియోగిస్తున్నారని చెబుతున్నారు. బంగ్లాదేశ్ రక్షణ అవసరాల కోసం మోహరింపు అని చెప్పినప్పటికీ, ఆధునాతన డ్రోన్‌లను సున్నితమైన ప్రాంతంలో ఉంచడం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది.

# ఢిల్లీ గడ్డపై కమల వికాసం..

## ఆప్ ఖేల్ ఖతం!




ఇండియా క్యాపిటల్ ఢిల్లీలో జెండా పాతేసింది బీజేపీ పార్టీ. ఇన్నాళ్లు ఢిల్లీలో ఏక చక్రాధిపత్యాన్ని కొనసాగిస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీకి .. కమలం పార్టీఫుల్‌స్టాప్ పెట్టింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అరవింద్ కేజ్రీవాల్ పార్టీ ఓటమి చెందింది. ఢిల్లీలో అధికారిన్ని కోల్పోయింది ఆమ్ ఆద్మీ సర్కార్. మూడు సార్లు ఢిల్లీ ఎన్నికల్లో గెలిచిన ఆమ్ ఆద్మీకి.. ఈ సారి ఢిల్లీ ఓటర్లు రెస్ట్ ఇచ్చారు. ఇక పాలించింది చాలు అంటూ సెలవిచ్చారు. దీంతో ఢిల్లీ పీఠం బీజేపీ సొంతమైంది. మునుపటి కంటే.. ఈ సారి ఎన్నికలు చాలా హెూరాహెూరీగా జరిగాయి. గెలుపు కోసం ఆప్, బీజేపీ గట్టిగా తలపడ్డాయి. ఎలాగైనా ఢిల్లీ పీఠాన్ని సొంతం చేసుకోవాలన్న పట్టుదలతో..బీజేపీ అగ్రనాయ కత్వం అంతా ఢిల్లీని చుట్టేశారు. మరోవైపు ఆప్ నుంచి కూడా కేజ్రీవాల్ తన శక్తినంతా ఒడ్డి..గెలుపు కోసం ప్రయత్నించారు. చివరి వరకు గట్టి పోటీయే ఇచ్చిన ఆప్.. చెప్పుకోదగ్గ సీట్లు సాధించి ప్రతిపక్షానికి పరిమితమైంది. తమకు డబల్ ఇంజిన్ సర్కారే కావాలంటూ.. ఢిల్లీ ప్రజలు కమలానికే అధికార పీఠం కట్ట పెట్టారు. దీంతో 27 ఏళ్ల తర్వాత.. ఢిల్లీలో బీజేపీ అధికారాన్ని చేజిక్కించుకుంది. ఈసారి ఎన్నికలు ఆప్‌కి చాలా కష్టతరంగానే మారాయనే చెప్పుకోవాలి. ఎందుకంటే కేజ్రీవాల్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలు..ఆయన సీఎం పదవికి రాజీనామా చేయడం వంటి కీలక పరిణాల మధ్య.. ఆ పార్టీ ఎన్నికలకు వెళ్లింది. దీంతో ప్రభావం ఎన్నికల ఫలితాలపై స్పష్టంగా కనిపించింది. కేజ్రీవాల్ జైలు కెళ్లడం.. అవినీతి ముద్ర పడటంతో ఆ ప్రభావం పార్టీపై పడింది. దీంతో ఆప్ నేతలు, క్యాడర్ సైతం అధినేత అరెస్టుతో ఢీలా పడ్డారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో కీలక ఆప్ నేతలు అరెస్టులు.. ఆ పార్టీని కుదిపేశాయి. దీంతో కష్టతరమైన పరిస్థితుల మధ్య ఎన్నికలుక వెళ్లిన ఆప్.. బీజేపీ హవా ముందు నిలవలేకపోయింది. దాదాపు ఆప్ కీలక నేతలు ఓడిపోయారు. ముఖ్యంగా కేజ్రీవాల్‌ను బాగా టార్గెట్ చేసింది బీజేపీ. న్యూఢిల్లీలో ఆయన పోటీచేసే స్థానంపై గురిపెట్టింది. కేజ్రీవాల్‌కు పోటీగా మాజీ సీఎం కొడుకు సాహిబ్ సింగ్ కుమారుడు పర్వేశ్ వర్మను పోటీలోకి దింపింది బీజేపీ. మరోవైపు ఢిల్లీ ఎన్నికల్లో ఎక్కడా ఖాతా తెరవలేకపోయింది కాంగ్రెస్. అయితే కాంగ్రెస్, ఆప్ వేరుగా పోటీ చేయడం బీజేపీకి కలిసొచ్చింది. కాంగ్రెస్ ఓట్లు చీల్చడంతో బీజేపీ గెలుపు సులభతరమయింది. ఈ ఫలితాలతో ఆమ్ ఆద్మీ పార్టీ పూర్తిగా తుడిచి పెట్టుకుపోతుందా అంటే.. అలా చెప్పలేం. ఎందుకంటే.. చాలా రాజకీయ పార్టీలు.. ఎన్నికల్లో ఓడిపోవడం సహజం.. కానీ పూర్తిగా పార్టీలు కనుమరుగయ్యే సందర్భాలు తక్కువ. అందులోనూ.. ఢిల్లీలో రెండుసార్లు ఐదేళ్లపాటూ.. పూర్తి పాలనను ఇచ్చిన ఆప్.. పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి ఉండదు. కాకపోతే.. ఆ పార్టీ తిరిగి కోలుకోవడం చాలా కష్టం. ఎందుకంటే.. ఢిల్లీ కేంద్ర గడ్డపై, రాష్ట్ర గడ్డపై రెండు చోట్లా బీజేపీ జెండా ఎగురుతుంది కాబట్టి.. మళ్లీ ఆప్‌కి ఛాన్స్ ఇచ్చే పరిస్థితి బీజేపీ తెచ్చుకుంటుంది అని ఇప్పుడే చెప్పలేం. చిత్రమేంటంటే.. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీజేపీ ఇలాగే పోరాడింది. కానీ.. అప్పుడు మాత్రం.. ఢిల్లీ ప్రజలు.. లోకల్‌గా ఆప్‌కీ, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఛాన్స్ ఇచ్చారు. అదే విధంగా మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో కూడా.. కమలం మొత్తం 7 లోక్‌సభ స్థానాలనూ గెలుచుకుంది. అదే విధంగా.. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాషాయదళం బలంగా సత్తా చాటి.. కేజ్రీవాల్‌కి కోలుకోలేని షాక్ ఇచ్చింది. ఈ ఎన్నికల్లో గెలిస్తే.. తాను అవినీతికి పాల్పడనట్లే అని శపథం పూనిని కేజ్రీవాల్.. తాను గెలిచేవరకూ.. సీఎం సీటులో కూర్చోను అన్నారు. ఆ అవసరం లేదన్న ప్రజలు.. పూర్తిగా ఆయన్ని సీఎం సీటుకి దూరం చేశారు. ఇక ఇప్పుడు ఆయనపై ఉన్న కేసు.. బుసకొట్టే పాములా పైకి లేచే అవకాశం ఉంటుంది. ఆయన మళ్లీ జైలుకెళ్లినా ఆశ్చర్యం అక్కర్లేదు. అవినీతిపై పోరాటం అంటూ.. వచ్చి.. అదే అవినీతి ఆరోపణలతో.. ఢిల్లీ గద్దను చీపురు పార్టీ దూరం చేసుకున్నట్లైంది. ప్రాంతీయ పార్టీలను ఒక్కొక్కటిగా బలహీనం చేస్తున్న బీజేపీ ఈ గెలుపుతో.. మరింత ఉత్సాహంగా దూసుకెళ్లే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.




దాదాపు 27 ఏళ్ల తర్వాత దిల్లీ కోటపై కాషాయ జెండా ఎగురవేసింది. తాజాగా వెలువడుతున్న దిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి గట్టి షాకిచ్చి.. భాజపా ఘన విజయం దిశగా దూసుకెళ్తోంది. ఇక ప్రభుత్వ ఏర్పాటే తరువాయి. మరి దిల్లీ తదుపరి ముఖ్యమంత్రి ఎవరు? ఇన్నేళ్ల తర్వాత అధికారంలోకి రాబోతోన్న భాజపా.. దిల్లీ పగ్గాలను ఎవరికిస్తుందనేదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ క్రమంలోనే పలువురు పేర్లు తెరపైకి వస్తున్నాయి. ముఖ్యంగా ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం కేజ్రీవాల్‌ను ఓడించిన పర్వేశ్ వర్మ పేరు సీఎం రేసులో ప్రధానంగా వినిపిస్తోంది.

**పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ :** దిల్లీ మాజీ ముఖ్యమంత్రి సాహిబ్ సింగ్ వర్మ కుమారుడైన పర్వేశ్ వర్మ (%ఝుతీజవంష్ట్ర ఎవతీఝ%).. 2014 నుంచి 2024 వరకు పశ్చిమ దిల్లీ నుంచి లోక్‌సభ సభ్యుడిగా కొనసాగారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఈయన రికార్డు స్థాయిలో 5.78 లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. దిల్లీ చరిత్రలో ఓ లోక్‌సభ అభ్యర్థి సాధించిన అత్యధిక మెజార్టీ ఇదే కావడం విశేషం.అయితే వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో గత ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో టికెటు ఇవ్వలేదు. అనంతరం అసెంబ్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్‌కు దీటైన అభ్యర్థిగా ఎవర్ని దించాలన్న దానిపై భాజపా భారీ కసరత్తు చేసింది. చివరకు వర్మను రంగంలోకి దించింది. అధిష్ఠానం నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ.. తాజాగా వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఆప్ అధినేత కేజ్రీవాల్‌నే ఓడించి జెయింట్ కిల్లర్‌గా పర్వేశ్ దేశం దృష్టిని ఆకర్షించారు. దీంతో ఆయనే సీఎం అయ్యే అవకాశాలు ఎక్కువగా కన్పిస్తున్నాయి.

**రమేశ్ బిధూరి..** భాజపా దిల్లీ ఫైర్‌బ్రాండ్ నేతల్లో ఒకరిగా రమేశ్ బిధూరికి పేరుంది. గతంలో పార్లమెంట్ లోపలా, వెలుపలా వివాదాస్పద వ్యాఖ్యలు చేసి వార్తల్లో నిలిచారు. ఈ క్రమంలోనే లోక్‌సభ ఎన్నికల్లో భాజపా ఈయనకు టికెట్ నిరాకరించింది. అయితే, దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనను ఏకంగా దిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ పోటీ చేసిన కాల్‌కాజీ స్థానంలో నిలబెట్టడం చర్చనీయాంశమైంది. దీంతో ఆయనే భాజపా ముఖ్యమంత్రి అభ్యర్థి అంటూ ప్రచారం జరిగింది. తాజా ఎన్నికల్లో ఆయన ఆతిశీకి చివరి వరకు గట్టి పోటినిచ్చి స్వల్ప తేడాతో ఓటమిపాలయ్యారు. అయితే, ప్రచారంలో ఆయన ఆతిశీపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఈ నేపథ్యంలో భాజపా ఆయనవైపు మొగ్గుచూపుతుందో లేదో..!

**కైలాశ్ గహ్లోత్..** దిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది నెలల ముందే కైలాశ్ గహ్లోత్ ఆమ్ ఆద్మీ పార్టీకి గుడ్‌బై చెప్పి భాజపాలో చేరారు. జాట్ వర్గానికి చెందిన కైలాశ్ గహ్లోత్ గతంలో ఆప్ సర్కారులో రవాణా మంత్రిగా పనిచేశారు. తాజా ఎన్నికల్లో బిజ్వాసన్ స్థానం నుంచి పోటీ చేసిన ఆయన.. విజయం దిశగా ఉన్నారు.

**మహిళా సీఎం ఉంటారా? :** ముఖ్యమంత్రి రేసులో భాజపా ఎంపీ బన్సూరీ స్వరాజ్ పేరు కూడా వినిపిస్తోంది. భాజపా దివంగత నేత సుష్మా స్వరాజ్ కుమార్తె అయిన బన్సూరీ గతేడాదే ప్రత్యక్ష రాజకీయాల్లోకి అరంగేట్రం చేశారు. ఆ ఎన్నికల్లో న్యూదిల్లీ లోక్‌సభ నియోజకవర్గం నుంచి గెలిచి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. తాజా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోనూ చురుగ్గా పాల్గొన్నారు. దీంతో ఆమె సీఎం రేసులో నిలిచారు. ఇక, మాజీ ఎంపీ స్మృతి ఇరానీ పేరు కూడా తెరపైకి వస్తోంది. ఒకవేళ బన్సూరీ లేదా స్మృతి ఇరానీవైపు భాజపా మొగ్గు చూపితే ఈ పార్టీ నుంచి దిల్లీకి మరోసారి మహిళా ముఖ్యమంత్రి రానున్నారు. భాజపా దివంగత నేత సుష్మా స్వరాజ్ గతంలో దిల్లీ ముఖ్యమంత్రిగా వ్యవహరించారు.

**అనూహ్య నిర్ణయమేనా..?...** భాజపా దిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ, పార్టీ జాతీయ కార్యదర్శి దుశ్యంత్ గౌతమ్, ఎంపీ మనోజ్ తివారీ, సీనియర్ నేతలు కపిల్ మిశ్రా, అర్విందర్ సింగ్ లవ్లీ పేర్లు కూడా సీఎం రేసులో వినిపిస్తున్నాయి. సంప్రదాయాన్ని పాటిస్తూ భాజపా ఎప్పటిలాగే ముఖ్యమంత్రి అభ్యర్థి లేకుండానే దిల్లీ బరిలోకి దిగింది. ఫలితాల తర్వాత అనేక అంశాలు, సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని సీఎంను ఖరారు చేస్తుంది. గతంలో రాజస్థాన్, మధ్యప్రదేశ్ ఎన్నికల సమయంలో ఈ విషయం స్పష్టమైంది. దీంతో దిల్లీలోనూ అనూహ్యంగా మరో వ్యక్తి సీఎం రేసులోకి వచ్చే అవకాశం లేకపోలేదు..!




ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి షాకుల మీద షాకులు తగులుతున్నాయి. ఊహించని విధంగా ఆ పార్టీ దారుణంగా దెబ్బతింది. ఫలితాల్లో బీజేపీ దూకుడు ముందు ఆప్ నిలబడలేకపోయింది. స్వయంగా ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఓటమి పాలయ్యారు. ఆయనతో పాటు పార్టీ ముఖ్య నేతలు మనీష్ సిసోడియా, సత్యేంద్ర జైన్ కూడా పరాజయం మూటగట్టుకున్నారు. దీంతో అంతా షాక్ అవుతున్నారు. తనను ఓడించే వాళ్లే లేరంటూ బీరాలు పోయిన కేజ్రీవాల్ ఓటమిని ఆప్ కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆయనకు ఈ పరిస్థితి రావడానికి ఓ శాపమే కారణమనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే శాపం తగలడంతోనే కేజ్రీవాల్ దారుణ ఓటమి పాలయ్యారనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఆయన పార్టీ భారీ ఓటమికి కూడా అదే రీజన్ అనే వ్యాఖ్యలు వస్తున్నాయి. ఒకప్పుడు అన్నా హజారే–కేజ్రీవాల్ కలసి పనిచేశారు. అవినీతికి వ్యతిరేకంగా గళమెత్తారు. అవినీతి వ్యతిరేక ఉద్యమంలో భుజం భుజం కలిపి ముందుకు సాగారు. అయితే ఆమ్ ఆద్మీ పార్టీ పెట్టాలని కేజ్రీవాల్ డిసైడ్ అవడంతో వీళ్ల స్నేహానికి బ్రేక్ పడింది.

**చెప్పినా వినలేదు!...** రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వాలనే కేజ్రీవాల్ నిర్ణయాన్ని అన్నా హజారే అప్పట్లో తీవ్రంగా వ్యతిరేకించారు. ఉద్యమ ఆశయాలను ఇది పక్కదారి పట్టిస్తుందని వారించారు.

పొలిటికల్‌గా ఎదగాలనే కేజ్రీవాల్ కోరికను ఆయన తప్పుబట్టారు. ఉద్యమానికి ఇది పూర్తి వ్యతిరేకమని ఖండించారు. కానీ కేజ్రీవాల్ మాట వినలేదు. పార్టీ స్థాపించి గెలిచారు. ఢిల్లీ గద్దెనెక్కి సీఎంగా పాలన సాగించారు. అయితే అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమం చేసిన కేజ్రీవాల్ తిరిగి అదే అవినీతిలో మునిగిపోయారు.. ఆయన ప్రభుత్వం అవినీతిమయంగా మారిందనే విమర్శలకు గురైంది.




# చీపురు తిరగేసిన ఢిల్లీ ప్రజలు..

## ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఓటమికి 5 కారణాలు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ బార్టీ బొక్క బోర్లా పడిందని మనకు ఫలితాల్ని చూస్తే అర్థం అవుతూనే ఉంది. ఒక రకంగా చెప్పాలంటే.. ఆ పార్టీ ఓడిపోవడం అనేది అంత మంచి విషయమేమీ కాదు. ఎందుకంటే.. ఆ పార్టీ పుట్టిందే ఓ మంచి ఉద్దేశంతో. ఈ దేశంలో అవినీతి విపరీతంగా పెరిగిన సమయంలో.. ఇండియా ఎగైనెస్ట్ కరెప్షన్ ఉద్యమం నుంచి పుట్టిన పార్టీ ఆప్. దానికి ఉన్న గుర్తు కూడా చీపురు. చెత్తను తొలగించేది చీపురు కాబట్టి.. ఆ గుర్తునే దానికి పెట్టారు. ఆ పార్టీ పదేళ్లుగా అప్రతిహతంగా ఢిల్లీని ఏలుతూ.. అవినీతి వ్యతిరేక పార్టీగా మంచి పేరు తెచ్చుకుంది. అలాంటి ఆ పార్టీ ఈ ఎన్నికల్లో ఓడిపోయిందంటే.. ఇక అవినీతిపై పోరాటానికి విలువ ఏముంది? చిత్రమేంటంటే.. అసలు ఆ పార్టీ ఓడిపోవడానికి కూడా అదే అవినీతి మరకలు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. ఐతే.. ఆప్ ఓటమికి గల 5 ప్రధాన కారణాలను చూద్దాం. ఎక్కడైనా ఒకే పార్టీ సుదీర్ఘకాలం అధికారంలో ఉంటే.. ఆటోమేటిక్‌గా ప్రజల్లో వ్యతిరేకత వస్తుంది. తెలంగాణలో బీఆర్ఎస్ పదేళ్ల పాలన తర్వాత అధికారం కోల్పోయింది. ఢిల్లీలో మోదీ సారథ్యంలో బీజేపీ పదేళ్ల పాలన తర్వాత.. లోక్‌సభ ఎన్నికల్లో సొంతంగా మెజార్టీని దక్కించుకోలేకపోయింది. అదే విధంగా ఢిల్లీలో ఆప్ కూడా పట్టు కోల్పోయింది. కేజ్రీవాల్ ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం ప్రజలకు నచ్చలేదు. మార్పు మంచిదే అనుకున్నారు. మీరు గమనిస్తే.. ఈ ఐదేళ్లలో కేజ్రీవాల్.. ఢిల్లీ పాలనపై ఫోకస్ తగ్గించి.. ఆప్‌ని దేశవ్యాప్తంగా విస్తరించాలని యత్నించారు. గుజరాత్, గోవా, హర్యానా ఇలా ఇతర రాష్ట్రాల్లో పోటీకి అభ్యర్థులను నిలబెడుతూ.. పార్టీ విస్తరణపైనే దృష్టి పెట్టారు. దాంతో.. ఢిల్లీ ప్రజలకు చిరాకొచ్చింది. కేజ్రీవాల్ తన స్వార్థం తాను చూసుకుంటున్నారనీ, ఢిల్లీని పట్టించుకోవట్లేదని ప్రజలు భావించారు. దాంతో చీపురు తిరగేసిన ఢిల్లీ ప్రజలు.. గట్టిగానే వాయించారు. దానికి తోడు.. స్థానిక ఆప్ నేతలు కూడా.. ప్రజా సమస్యలు పట్టించుకోవడం మానేశారు. ఎంతసేపూ బీజేపీని తిడుతూ కాలక్షేపం చేశారు. అందుకే ప్రజలు.. పూర్తిగా కాలక్షేపం ఇచ్చారు. ఈ ఎన్నికల్లో బీజేపీ వ్యూహాత్మక ప్రచారాన్ని కూడా లెక్కలోకి తీసుకోవాలి. ఆప్‌లో ఉన్న లోపాలను ఆ పార్టీ బాగా ఎత్తి చూపింది. అంతేకాదు.. అవినీతి పార్టీగా ఆప్‌ని ప్రజల్లో ఫోకస్ షిఫ్ట్ చేసింది. లిక్కర్ స్కామ్ కేసులో మనీశ్ సిసోడియా, కేజ్రీవాల్‌ని జైలుకి పంపడం ద్వారా.. బీజేపీ తాను చెప్పిందే నిజం అని ప్రజలు కొంతవరకూ నమ్మేలా చేసింది. ఈ కేసులో నిజానిజాలు ఇంకా తేలకపోయినా.. ప్రస్తుతానికి బీజేపీ పాచిక పారింది. ఢిల్లీలో ప్రభుత్వం మారే టైమ్ వచ్చింది అని ప్రజలు భావించేలా చెయ్యడంలో కమలం గ్రాండ్ సక్సెస్ అయ్యింది. బీజేపీలో కొత్త కొత్త నేతలు రావడం సహజం. కానీ ఆమ్ ఆద్మీ పార్టీ కేజ్రీవాల్ ఫోకస్‌గా ఉంటుంది. ఆ పార్టీలో ఆయనే నేషనల్ ఫేస్. మిగతా నేతలంతా అంతగా క్రేజ్ లేనివారే. ఫలితంగా ఆ పార్టీ నానాటికీ బలహీనపడుతూ వచ్చింది. ఇప్పుడు ఎన్నికల్లో కూడా కాస్తో, కూస్తో పేరున్న నేతలు సైతం పరాజయం పొందుతున్నారు. స్వయంగా కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా సైతం ఓడిపోయారు. ఇలా ఆ పార్టీ ఎదుగుదల అనేది సరిగ్గా సాగట్లేదు. ఈ ఓటమితో ఆ పార్టీ మరింత బలహీనపడటం ఖాయం. ఈ ఎన్నికలకు ముందు బీజేపీ.. బడ్జెట్‌లో సామాన్య, మధ్య తరగతి వారికి మేలు చేసేలా పన్ను మినహాయింపులు ఇచ్చింది. ఈ ఓటర్లు దాదాపు 40 లక్షల మంది దాకా ఢిల్లీలో ఉన్నారు. వీరంతా ఇదివరకు ఆప్‌తో ఉండేవారు. ఇప్పుడు వారు.. బీజేపీవైపు చూశారు. దాంతో.. కోర్ ఓటర్లకు ఆప్ దూరమైంది. వారి నమ్మకాన్ని చీపురు పార్టీ కోల్పోయింది. అదే సమయంలో.. బీజేపీ.. క్రమంగా పుంజుకుంటూ.. ప్రజలకు చేరువైంది.

ఇలా కేజ్రీవాల్.. నేల విడిచి సాము చేసి.. ఢిల్లీ ప్రజలకు దూరమయ్యారు. ఇప్పుడు మళ్లీ ఆయన వారి మనసులు గెలుచుకోవడం అంత తేలిక కాదు. ఆమ్ ఆద్మీ పార్టీ నేతలపై బీజేపీ ఎలా ముందుకెళ్తుంది అనే దాన్ని బట్టీ ఆ పార్టీ ఫ్యూచర్ ఆధారపడి ఉంటుంది.

# సంపాదకీయం

## నాడు జగన్... నేడు చంద్రబాబు సేమ్ టు సేమ్ జరిగిందా..?

ఏపీలో ఏదో జరిగిపోతోందని.. రాష్ట్రం అప్పుల మయం అయిపోతోందని పెద్ద ఎత్తున విమర్శలు వచ్చిన విషయం గుర్తుంది కదా! వైసీపీ హయాంలో టీడీపీ నాయకులు, జనసేన నాయకులు ఊరూ వాడా ప్రచా రం చేసిన విషయం గుర్తుంది కదా! ఏపీని శ్రీలంకతో కొన్ని రోజులు, ఉగాండా వంటి అత్యంత దుర్భర ఆఫ్రికన్ దేశంతో మరికొన్ని రోజులు పోలుస్తూ... నాయకులు పెద్ద ఎత్తున విమర్శలు చేశారు. జగన్ జమానా అప్పులు ఖజానా నినాదాన్ని కూడా ఊరూ వాడా ప్రచారం చేశారు. కట్ చేస్తే.. ఈ విషయం ఒక్కటే కాదు.. పోలవరం ప్రాజెక్టు విషయంలోనూ.. ఇలానే ప్రచారం జరిగింది. ఈ ప్రాజెక్టు ఎత్తును జగన్ తగ్గించేస్తున్నారని, ఇక, ఇది ఒక మధ్యతరహా ప్రాజెక్టుగానే (ప్రకాశం బ్యారేజీ టైపు) మారిపోనుందని కూడా చెప్పుకొచ్చారు. కేంద్రంతో లాలూచీ పడ్డారని కూడా వ్యాఖ్యానించారు. గుండెలు బాదుకున్నారు. కన్నీరు పెట్టుకోలేదు అంతే! కథ ఇక్కడితో కూడా ముగియలేదు. గౌతం అదానీకి రాష్ట్రాన్ని అమ్మేస్తున్నారని కూడా వ్యాఖ్యానించారు. రోజూ అవే విమర్శలు. అవే కథనాలు. అవే వార్తలతో రాష్ట్ర వ్యాప్తంగా హోరెత్తించారు. ఇక్కడ యూటర్న్ తీసుకుంటే.. ఇప్పుడు ఇవే కథనాలు, ఇవే విమర్శలు అటు వైసీపీ శిబిరం నుంచి వినిపిస్తున్నాయి. రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం అప్పులు మయం చేస్తోందని, వచ్చిన నాలుగు మాసాల్లోనే 72 వేల కోట్ల అప్పులు చేశారని వైసీపీ అనుకూల మీడియా ప్రచారం చేస్తోంది. అంతేకాదు.. పోలవరం గురించి గత నాలుగు రోజులుగా కథ నాలు రాస్తూనే ఉన్నాయి. ఎత్తు తగ్గించేస్తున్నారని.. బ్యారేజీ అయిపోయిందని కూడా రాసుకొచ్చారు. ఇక, ఇదేసమయంలో అదానీకి చంద్రబాబు రాష్ట్రాన్ని రాసిచ్చేస్తున్నారని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మొత్తంగా చూస్తే.. అటు పక్షం ఇటు, ఇటు పక్షం అటు మారింది. విషయం మాత్రం అలానే ఉంది. దీనికి కారణం.. అధికారం దక్కించుకోవడం ఒకరి పక్షం, చేజారిన పక్షం ఇంకొకటి. కానీ, వాస్తవం మాత్రం.. ఎప్పుడూ జరిగేదే. అది కేంద్రం నిర్దేశించేదే. అన్ని రాష్ట్రాలకూ అప్పులు చేసుకునే వెసులు బాటు కేంద్రమే కల్పించింది. కాబట్టి అప్పుడైనా.. ఇప్పుడైనా అప్పులు తప్పవు. అదానీకి ప్రాజెక్టులు అప్పగిస్తే.. మోడీ కళ్లలో ఆనందం కోసం .. ఆనాడు జగన్ వ్యవహరించారు. ఇప్పుడు కూడా సేమ్ టు సేమ్ జరుగుతోంది. అలానే.. పోలవరం ఎత్తు విషయంలో వివాదం లేకుండా కేంద్రం చేసిన మధ్యే మార్గ నిర్ణయం ఎత్తు తగ్గింపు. తద్వారా.. ఒడిశా, తెలంగాణల నుంచి వస్తున్న వివాదాలకు చెక్ పెట్టింది. ఇది ఎప్పుడు జరిగినా.. కేంద్రం తీసుకున్న నిర్ణయానికే ఏపీ కట్టుబడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయాలు సామాన్య ప్రజలకు తెలియదు. కానీ, రాజకీయంగా మాత్రం ఈ విషయాలు ఇరు పక్షాలకు ఆయుధాలుగానే మారాయి. అంతే తేడా..!

# ప్రభుత్వ పథకాలను అర్హులందరూ సద్వినియోగ పరుచుకోవాలి

## శామీర్ పేట మండల పరిషత్ లో నిర్వహించిన జాబ్ మేళాకు అద్భుత స్పందన





శామీర్ పేట, (గరుడ వార్త) : ప్రభుత్వ పథకాలను యువతి, యువకులు అందిపుచ్చుకొని అభివృద్ధి వైపు అడుగులు వేయాలని జిల్లా డీఆర్డీఓ సాంబశివరావు ఆకాంక్షించారు. శనివారం శామీర్ పేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఈడీఎంఎం ఆధ్వర్యంలో గ్రామీణ నిరుద్యోగ యువతి, యువకు లకు ఉపాధిని కల్పించేందుకై జాబ్ మేళా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ జాబ్ మేళాకు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన అర్హులైన యువతి, యువకులు హాజరై పలు కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలలో పాల్గొన్నారు. ఈ జాబ్ మేళాకు మొత్తం 142 మంది యువతీ, యువకులు హాజరయ్యారు. వీరిలో 15 మంది అపోలో ఫార్మసీ ఉద్యోగాలకు, 12 మంది నిర్మాణ శిక్షణ ఉపాధి ఉద్యోగాలకు, 12 మంది జీయో టెక్నాలజీ ఉద్యోగాలకు, 4 మంది టాటా స్పెస్ ఉద్యోగాలకు, 21 మంది త్రెడ్స్ టెక్నాలజీ ఉద్యోగాలకు, 10 మంది ఈసీ ఈసీఈ ఇన్సురెన్స్ ఉద్యోగాలు చేసేందుకై యువతి యువకులు ఎంపికైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మమతాబాయి, ఎల్డీఎం శివప్రసాద్, శామీర్ పేట మండల ఏపీఎ మేనేజర్లు పాల్గొన్నారు.

# నల్సార్ లో జరిగిన జాతీయ మహిళా కమీషన్ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ నేరెళ్ళ శారద







శామీర్ పేట, (గరుడ వార్త) : మహిళలకు చట్టాలపై అవగాహన ఎంతో అవసరమని రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ నేరెళ్ళ శారద అభిప్రాయపడ్డారు. శనివారం శామీర్ పేట నల్సార్ యూనివర్సిటి ఆఫ్ లా చైల్డ్ అండ్ యూత్ లా సెంటర్ సహకారంతో జాతీయ మహిళా కమీషన్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, కేంద్రపాలిత ప్రాంతాలైన పుదుచ్చరి రాష్ట్రాలకు చెందిన జైళ్ళలో మహిళలకు సంబందించిన చట్టాలపై ఒక రోజు సుదీర్గ దక్షిణ ప్రాంత జైల్లలో ఉన్న మహిళలకు సంబంధించిన చట్టాల పైన దక్షిణభారత ప్రాంతీయ ఒక రోజు చర్చా గోష్టి జాతీయ మహిళా కమిషన్ సహకారంతో నిర్వహించింది.

ప్రారంభ సెషన్‌లో నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు ప్రముఖులకు స్వాగతం పలికి జైలులో ఉన్న మహిళలకు సంబంధించిన న్యాయప రమైన అంశాల ప్రాముఖ్యతను క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా కమీషన్ చైర్పర్సన్ నేరెళ్ళ శారద మాట్లాడుతూ జైళ్ళలో ఉన్న మహిళల ఖైదీలకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయని, వీటిని ప్రధానంగా పరిష్కరించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ఖైదీల పిల్లలకు విద్య ఇవ్వడం, మానసిక మద్దతు అందించడం, ప్రత్యేక జైళ్ళను ఏర్పాటు చేయడం వంటి మార్పులు ఎంతో అవసరమని ఆమె చెప్పారు. ఏపి హైకోర్ట్ మాజీ న్యాయమూర్తి జస్టిస్ ప్రకాశ్ రావు మాట్లాడుతూ మహిళ ఖైదీలపై అవగాహన పెంచేందుకు మరిన్ని సమావేశాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కన్వెషన్ కార్యక్రమాలు జైళ్ళలో ఉన్న మహిళలు, ట్రాన్స్‌జెండ్ వ్యక్తుల పరిస్థితులను మెరుగు పరిచేందుకు అవసరమైన చట్ట సంస్కరణలు, పరిష్కారాలను చర్చించడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆయన వివరించారు. అనంతరం నల్సార్ చైల్డ్ అండ్ యూత్ జస్టిస్ సెంటర్ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ బాలకృష్ణ ఈ చర్చ ఉద్దేశ్యాన్ని సందర్భోచితంగా వివరించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు ఈ చర్చావేదికలో ఈ సెషన్‌లో 1894 జైళ్ల చట్టం, 2016 మోడల్ ప్రిజన్ మాన్యువల్ వంటి వివిధ చట్టాలను సైతం ప్రస్తావించడంతో పాటు పలు అంశాలపై చర్చించారు. చివరగా నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా అసోసియేట్ ప్రొఫెసర్ రోస్మీ జోన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్లూరు, తమిళనాడు జైళ్ళ శిక్షణ అకాడమి మాజీ డైరక్టర్ డాక్టర్ ఎంఆర్ ఆహ్మద్, నల్సార్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు, జాతీయ మహిళా కమిషన్‌కు చెందిన లా ఆఫీసర్ మన్మోహన్ వర్మ, జాతీయ మహిళా చట్టం అధికారులు కేరళ రాష్ట్ర మహిళా కమీషన్ చైర్పర్సన్ పలువురు ఇతర రాష్ట్రాల మహిళ, శిశు కమీషన్ సభ్యులు, వివిధ రాష్ట్రాల ప్రొఫెసర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచస్థాయి వంటకాలకు కేరాఫ్ హైదరాబాద్.

## డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి..



తార్నాక : ప్రపంచ స్థాయి వంటకాలకు కేరాఫ్ అడ్రస్ హైదరాబాద్ నిలుస్తుందని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి అన్నారు. ప్రపంచ స్థాయి భోజన ప్రియులను హైదరాబాద్ ఆకట్టుకుంటుందని పేర్కొన్నారు.

నగరంలోని హెూటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు ప్రజల ఆరోగ్యం దృష్ట్యా నాణ్యత ప్రమాణాలు పాటించాలని కోరారు. కిచెన్ గదుల్లో శుచి శుభ్రత పాటించాలని సూచించారు. ఇండియన్, తందూరి, చైనీస్, బిర్యాణి, మండి వంటకాలతో తార్నాకలో నూతనంగా ఏర్పాటు చేసిన తాజీజ్ డైన్ ఇన్ హెూటల్ను టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డితో కలిసి శనివారం సాయంత్రం డిప్యూటీ మేయర్ ప్రారంభించి హెూటల్లోని కిచెన్ గదిని పరిశీలించారు.

అహార పదార్థాల నాణ్యతపై నిర్వాహకులను అడిగి తెలుసుకొని ఆహార పదార్థాలను స్వయంగా రుచి చూసారు. అనంతరం శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ విభిన్న రుచులకు కేరాఫ్ గా ఈ హైదరాబాద్ మహానగరం నిలుస్తుందన్నారు.

హైదరాబాద్ బిర్యాణికి ప్రపంచ వ్యాప్తంగా పేరుందని భోజన ప్రియుల అభిరుచి మేరకు వంటకాలను తార్నాక ప్రజలకు అందుబాటులో తీసుకురావడంపై నిర్వాహకులను అభినందించారు. ఈకార్యక్రమంలో నిర్వాహకులు దావూద్ అహమ్మద్ దస్తగీ. సయ్యద్ అయూబ్ ఆలీ తదితరులు పాల్గొన్నారు. తదితరులున్నారు.

# యాసంగి.. నెమ్మదిగా 'సాగు'తోంది!

ఖమ్మం : ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 'యాసంగి' పంటల సాగు ఇప్పటివరకు అంతంతమాత్రమే. ఖమ్మం జిల్లాలో ఈనెలాఖరు వరకు సాగు విస్తీర్ణం పుంజుకుంటుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. సాగర్ జలాలను వారబందీ పద్ధతిలో సరఫరా చేస్తామని అధికారులు ప్రకటించిన విషయం విదితమే. అయితే ప్రస్తుత సీజన్‌లో వరి సాగుకు రైతులు ఎక్కువగా మొగ్గుచూపటం లేదు. సాధారణంగా యాసంగిలో దొడ్డు రకాలను అధిక మంది ఎంచుకుంటారు. ఈ రకాలకు ప్రభుత్వం బోనస్ ఇవ్వకపోవటంతో సాగు విస్తీర్ణంపై ప్రభావం పడే అవకాశముంది. వానాకాలంతో పోల్చితే పెట్టుబడులూ ఎక్కువవుతాయని అన్నదాతలు చెబుతున్నారు. గులాబీ రంగు పురుగు వల్ల చాలా ప్రాంతాల్లో పత్తి పంట దెబ్బతింది. దీన్ని తొలగించి అధిక శాతం మంది మొక్కజొన్న సాగుకు పూనుకుంటున్నారు. పెట్టుబడి తక్కువవటం, ధర ఆశాజనకంగా ఉండటంతో మొక్కజొన్న పంట విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. గతంలో పోల్చితే వేరుసెనగ విస్తీర్ణమూ కొంతమేరకు పెరగటం విశేషం. భద్రాద్రి జిల్లాలో ఇప్పటివరకు 'వరి' తక్కువగానే సాగైంది. ఈనెలాఖరు వరకు పూర్తిస్థాయిలో



సాగయ్యే అవకాశముందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. జిల్లాలో ప్రధానంగా ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, బోర్ల కింద ఈపంట సాగవుతుంది. మొక్కజొన్న సాగు విస్తీర్ణం లక్ష్యం దిశగా వెళ్తోంది. పెసర సాగు ఆశాజనకంగా ఉంది. ఇతర పంటల సాగు విస్తీర్ణం నామమాత్రమే. ఉభయ జిల్లాల్లో రైతులకు అవసరమైన ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో వివిధ పంటల సాగు విస్తీర్ణం మరింత పెరుగుతుంది. రైతులకు అవసరమైన ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. యాసంగికి సాగుకు రైతులకు వ్యవసాయశాఖ అన్ని రకాలుగా సహకరిస్తుంది. దనసరి పుల్లయ్య, డీఏఓ, ఖమ్మం

# దళారులదే హవా

సంగారెడ్డి : జిల్లాలో పత్తి కొనుగోళ్లు నిర్దేశిత లక్ష్యానికి దూరంగా ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం.. కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది కొర్రీలతో విసుగు చెందిన కర్షకులు దళారులకు పంటను అమ్ముకుంటున్నారు. మద్దతు ధర దక్కక తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలో 4.19 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని, ఈ మేరకు కొనుగోళ్లు చేపట్టాలని అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించారు. గత నవంబరు నుంచి ఇప్పటి వరకు 1.15 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి మాత్రమే అధికారికంగా కొనుగోలు చేశారు. అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు దళారులతో కుమ్మక్కయ్యారనే విమర్శలొస్తున్నాయి.

**3.49 లక్షల ఎకరాల్లో సాగు**

ఈ ఏడాది వానా కాలంలో 3.60 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. 3.49 లక్షల ఎకరాల్లో సాగయింది. జిల్లాలో సదాశివపేట, రాయికోడ్, జోగిపేట, నారాయణఖేడ్, వట్‌పల్లి, జహీరాబాద్, పటాన్‌చెరులో మార్కెటింగ్ శాఖకు యార్డులున్నాయి. వీటిలో పటాన్‌చెరు, సంగారెడ్డి మినహా మిగిలిన అన్ని చోట్ల పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 22 కేంద్రాల్లో గత నవంబరు నాలుగో తేదీ నుంచి ఈ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. 12 శాతం లోపు తేమ ఉంటే కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర.. పొడవు గింజ రకానికి రూ.7521(క్వింటాలుకు), పొట్టి గింజ రకానికి రూ.7121(క్వింటాలుకు) రైతులకు చెల్లించాలి.

**ఫిర్యాదు చేయండి.. రైతులకు న్యాయం చేస్తాం**

అన్నదాతలు సీసీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే పంటను విక్రయించాలి. దళారులకు విక్రయించి మోసపోవద్దు.



కొందరు రైతులు ఎరువులు, విత్తనాల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించారు. వారికే పంటను అమ్ముతున్నారు. సీసీఐ సిబ్బంది దళారులతో కుమ్మక్కయినట్లు సమాచారం ఉంటే ఫిర్యాదు చేయాలి. రైతులకు న్యాయం చేస్తాం. ఫిబ్రవరి వరకు పత్తి కొనుగోళ్లు కొనసాగుతాయి. – మహ్మద్ రియాజ్, ఏడీ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ.

**దందా తీరిది..**

భారత పత్తి సంస్థ(సీసీఐ) ఆధ్వర్యంలో జిల్లాలో అధికారికంగా పత్తి కొనుగోలు చేయాలి. 30 నుంచి 40 శాతం రైతులు మాత్రమే ఈ కేంద్రాల్లో పంట విక్రయించారు. మిగిలిన పంట దళారుల చెంతకు చేరుతోంది. దళారులు, సీసీఐ కేంద్రాల నిర్వాహకుల మధ్య అవగాహన ఉందనే ఆరోపణలొస్తున్నాయి. పంట నమోదులో ఇబ్బందులు, ఆధార్ అనుసంధానం, తేమ తదితర కొర్రీలతో ఇబ్బందుల వల్లనే కర్షకులు దళారులకు పంట విక్రయించడానికి మొగ్గు చూపుతున్నారని పలువురు అభిప్రాయ పడుతున్నారు. పొడవు గింజ రకానికి మద్దతు ధర క్వింటాలుకు రూ.7521 ఉండగా దళారులు రూ.ఏడు వేల లోపు మాత్రమే చెల్లిస్తున్నారు.

**జిల్లాలో పత్తి విక్రయాలు ఇలా..**

(గత నవంబరు 4 నుంచి ఈ నెల 5 వరకు)

పత్తి దిగుబడి అంచనా: 4.19 లక్షల మెట్రిక్ టన్నులు
పంట విక్రయించిన రైతులు: 41,407
సీసీఐ కేంద్రాల్లో కొనుగోలు: 1.15 లక్షల మెట్రిక్ టన్నులు
కొనుగోలు చేసిన పత్తి విలువ: రూ.853.99 కోట్లు
రైతుల ఖాతాల్లో జమ: రూ.723.12 కోట్లు
బకాయిలు: రూ.130.87 కోట్లు

# నెలకో మహిళతో ఎండీఎంఏ స్మగ్లింగ్



హైదరాబాద్: ఢిల్లీ కేంద్రంగా మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్న ముఠాగుట్టును హైదరాబాద్ యాంటీ నార్కొటిక్స్ వింగ్(హెచ్‌న్యూ), సౌత్‌వెస్ట్‌జోన్ పోలీసులు బట్టబయలు చేశారు. తొలిసారి రూ.1.6కోట్ల విలువైన 1300 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. మూడు వేర్వేరు కేసుల్లో ముగ్గురు నైజీరియన్లను అరెస్టు చేశారు. ఇద్దరి వీసా, పాస్‌పోర్టు ముగియడంతో సొంతదేశానికి డిపోర్టేషన్ చేయనున్నారు. బుధవారం సౌత్‌వెస్ట్ డీసీపీ చంద్రమోహన్, హెచ్‌న్యూ డీసీపీ వై.వి.ఎస్.సుధీంద్ర వివరాలు వెల్లడించారు.

**ముగ్గురు భార్యలు.. గర్ల్‌ఫ్రెండ్స్‌తో:** నైజీరియాకు చెందిన ఒలివర్ ఒగుచుకు అలియాస్ జాన్సన్(44) 2009లో బిజినెస్ వీసాపై ఢిల్లీ వచ్చి కొంతకాలం కాస్మోటిక్స్/వస్త్ర వ్యాపారం చేశాడు. స్థానిక నైజీరియన్లతో డ్రగ్స్ దందా ప్రారంభించాడు. 2013లో వీసా, పాస్‌పోర్టు గడువు ముగిసినా మారుపేర్లతో తప్పించుకొని తిరిగాడు. అదే ఏడాది హెరాయిన్‌తో ఢిల్లీ పోలీసులకు దొరికి ఐదేళ్ల 9 నెలలు జైల్లో ఉన్నాడు. బయటకు వచ్చాక గ్రాము ఎండీఎంఏను రూ.300 చొప్పున కొనుగోలు చేసి ముంబయి, హైదరాబాద్, బెంగళూరుల్లోని నైజీరియన్లకు రూ.600–1000కు విక్రయించేవాడు. రూ.లక్షలు చేతికి అందుతుండటంతో ముగ్గురు భార్యలు, 5–6గురు గర్ల్‌ఫ్రెండ్స్‌తో విలాసాలకు అలవాటు పడ్డాడు. పోలీసు నిఘా నుంచి తప్పించుకునేందుకు కిలోల కొద్దీ ఎండీఎంఏను ప్రతినెలా ఒక్కో నైజీరియన్ మహిళతో ఒగుచుకు చేరవేసేవారు. డ్రగ్ కింగ్‌పిన్ సూచనతో డ్రగ్స్‌తో నగరం చేరి పోలీసులకు చిక్కాడు. నిందితుడి నుంచి 1300 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకుంది.

**సరఫరాదారులతో మంతనాలు:** నైజీరియా నివాసి ఒగుచుక్వొ సిల్వెస్టర్ (44) 2012లో బిజినెస్ వీసాపై ముంబయి చేరి వస్త్ర వ్యాపారం ప్రారంభించాడు. 2019లో వీసా గడవు ముగిసినా అక్రమంగా దేశంలో ఉండటంతో ముంబయి పోలీసులు అరెస్టు చేశారు. రెండేళ్లు జైల్లో ఉండి బయటకు వచ్చి డ్రగ్స్ దందా మొదలుపెట్టాడు. కొద్దిరోజుల క్రితం నగరానికి వచ్చి సరఫరాదారులతో మంతనాలు చేస్తున్నట్టు సమాచారమందడంతో పోలీసులు అరెస్టు చేశారు.

**మౌసా మామూలోడు కాదు:** 2017లో నైజీరియా నుంచి మెడికల్ వీసాపై భారత్ వచ్చిన మౌసా క్యామరా(38) అలియాస్ రోమియో నిరక్షరాస్యుడు. 2020లో నైజీరియా వెళ్లొస్తూ కొకైన్‌తో ముంబయిలో పట్టుబడి 6 నెలలు జైల్లో ఉన్నాడు. విడుదలయ్యాక డ్రగ్స్ దందా ఎంచుకున్నాడు. బెంగళూరుకు చేరి కింగ్‌పిన్‌గా మారి ఏజెంట్ల ద్వారా డ్రగ్స్‌ను హైదరాబాద్‌కు చేరవేసేవాడు. గతేడాది అక్టోబరులో సూడాన్‌కు చెందిన అబ్దుల్ రెహ్మాన్ ఉస్మాన్ ద్వారా నగరంలో మాదకద్రవ్యాలు సరఫరా చేశాడు. దీనిపై హుమాయున్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి అబ్దుల్ రెహ్మాన్‌ను అరెస్ట్ చేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న మౌసా డెడ్‌డ్రాప్ తరహాలో తానే డ్రగ్స్ ఇచ్చేందుకు నగరానికి చేరినట్టు సమాచారం అందుకున్న హుమాయున్‌నగర్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

# ట్యాంకర్ల రూటు.. సపరేటు

హైదరాబాద్: మహానగరంలో నీటి ట్యాంకర్ల సరఫరాలో డ్రైవర్ల అక్రమ వ్యవహారాన్ని జలమండలి గుర్తించింది. ట్యాంకర్ల డ్రైవర్లే వినియోగదారుల నంబర్ల నుంచి బుక్ చేసి అక్రమంగా విక్రయిస్తున్న వ్యవహారం వెలుగు చూసింది. ఏకంగా 120 మంది డ్రైవర్లు వందల సంఖ్యలో ట్యాంకర్లను పక్కదారి పట్టించడంపై జలమండలి ఎండీ కె.అశోక్‌రెడ్డి సమగ్ర విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. వినియోగదారుల క్యాన్ నంబరు (నీటి కనెక్షన్ గుర్తింపు సంఖ్య)కు ట్యాంకర్ డ్రైవర్ల ఫోన్ నంబరుతో అనుసంధానం చేశారు. ఆ క్యాన్ నంబరుతో గృహ అవసరాలకు సబ్సిడీ రేట్లతో బుక్ చేసి ప్రైవేటుగా రెట్టింపు ధరలకు విక్రయించుకుంటున్నట్లు గుర్తించారు. గతేడాది వేసవిలో భారీగా అక్రమాలకు పాల్పడినట్లు వెల్లడైంది. ట్యాంకర్లను కొందరే ఎక్కువ బుక్ చేయడం వంటి అంశాలపై సమగ్ర పరిశీలన చేస్తుండగా..



డ్రైవర్ల నంబర్లే క్యాన్ నంబర్లకు అనుసంధానమై ఉండటంతో అక్రమం వెలుగు చూసింది. ఒక డ్రైవర్ ఏకంగా 900 ట్యాంకర్లు బుక్ చేయడం గమనార్హం. డ్రైవర్ల ఫోన్ నంబర్లతో అనుసంధానమైన క్యాన్ నంబర్లను బ్లాక్ చేశారు. డ్రైవర్లపై చర్యలకు జలమండలి విజిలెన్స్‌కు అప్పగించారు. ఈ వ్యవహారంలో జలమండలికి సంబంధించిన మేనేజర్లు లేదా ఉద్యోగుల ప్రమేయం ఉందా? అనే దానిపై విచారణ చేయనున్నారు.

**అక్రమాలపై విచారణ–ఎండీ**

అక్రమాలకు పాల్పడిన డ్రైవర్ల వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని ఎండీ కె.అశోక్‌రెడ్డి ఐటీ విభాగం అధికారులను ఆదేశించారు. బుధవారం ట్యాంకర్ల అక్రమాలపై ఐటీ విభాగంతో సమీక్షించారు. 40 మందికిపైగా డ్రైవర్లు అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించగా ట్యాంకర్ బుక్ చేసుకోలేని వారి క్యాన్ నంబర్లను గుర్తించి, వాటికి డ్రైవర్ల నంబర్లు అనుసంధానం చేసి బుక్ చేసి బ్లాక్‌లో అమ్మినట్లు జలమండలి ఒక ప్రకటనలో పేర్కొంది. ఒక్కో క్యాన్‌పై వంద ట్రిప్పులకు పైగా బుక్ చేసినట్లు తేల్చారు.

# కబ్జాకోరల్లోకి స్ట్రీట్ వెండింగ్ ఫుడ్ హబ్

మాదాపూర్ :జీహెచ్‌ఎంసీ స్ట్రీట్ వెండింగ్ ఫుడ్ హబ్‌ను ప్రైవేటు వ్యక్తులు హస్తగతం చేసుకుంటున్నారు. ఆ ప్రాంతంలో అడుగుపెట్టే వీల్లేకుండా కొందరు బండరాళ్లు, మట్టి డంప్ చేశారు. 2020లో అప్పటి జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ కమిషనర్ హరిచందన హయాంలో శిల్పారామం ఎదురుగా అయ్యప్ప సొసైటీ అండర్‌పాస్ పక్కనే నిరుపయోగంగా ఉన్న రోడ్డులో స్ట్రీట్ వెండింగ్ ఫుడ్ హబ్ నిర్మించారు. రూ.60 లక్షలు ఖర్చు చేసి రోడ్డుపై 50 స్టాల్స్ నిర్మించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు 50 మంది వీధి వ్యాపారులకు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ద్వారా వివిధ రకాల వంటకాల తయారీతోపాటు అల్పాహార కేంద్రాల నిర్వహణకు సంబంధించిన అంశాల్లో శిక్షణ ఇప్పించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ స్టాల్స్‌లో వివిధ రకాల అల్పాహారాలు విక్రయించుకొని చిరువ్యాపారులు జీవనోపాధి పొందేందుకు అవకాశం కల్పించారు.



**చర్యలు తీసుకుంటాం:** మోహన్‌రెడ్డి, ఉపకమిషనర్ చందానగర్ సర్కిల్ బండరాళ్లు వేసిన విషయం తెలియలేదు. ఆ స్థలం ఎవరికీ కేటాయించలేదు. క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

**రెండు రోజులకే మూత..**

ఈ ఫుడ్‌హబ్‌ను 2020 మార్చి 7న అధికారికంగా ప్రారంభించారు. ఫుడ్ హబ్ ఏర్పాటు చేసిన స్థలం తమదంటూ కొందరు ప్రైవేటు వ్యక్తులు కోర్టును ఆశ్రయించడంతో వివాదం మొదలైంది. దీంతో రెండు రోజులకే మూతపడింది. ఫుడ్ హబ్ స్థలంలో కొందరు ప్రైవేటు వ్యక్తులు దర్జాగా బండరాళ్లు, మట్టిని పోశారు. నాలుగేళ్లుగా నిర్వహణ లేక అధ్వానంగా తయారైన స్టాళ్లు ఇప్పుడు బండరాళ్లు వేయడంతో పనికిరాకుండా తయారయ్యాయి.

## కొరడా ఝుళిపిస్తున్నా.. ఆగని ఉల్లంఘన

హైదరాబాద్: పోలీసులు, రవాణాశాఖ అధికారులు ఎన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నా కొందరి నిర్లక్ష్యపూరిత డ్రైవింగ్ తీరు మారడం లేదు. గ్రేటర్ వ్యాప్తంగా ఏటా వేల సంఖ్యలో డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేస్తున్నప్పటికీ నిబంధనల ఉల్లంఘనలు ఆగడం లేదు. గతేడాది రవాణాశాఖ తెలిపిన అంకెల ప్రకారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరిలో 6094 లైసెన్సులు సస్పెండ్ చేశారు. అంతకుముందు ఏడాది అదే స్థాయిలో లైసెన్సులపై వేటు వేశారు. అయినా డ్రైవింగ్‌లో కనీస జాగ్రత్తలు పాటించడం లేదని అధికారులు చెబుతున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఎక్కువ మంది పోలీసులకు పట్టుబడుతున్నారు. ఈ కారణంతో లైసెన్సులు సస్పెన్షన్ అవుతున్నాయని హైదరాబాద్ సంయుక్త రవాణాశాఖాధికారి రమేష్ తెలిపారు. విదేశాలకు వెళ్లే కష్టమే..లైసెన్సులు సస్పెన్షన్‌లో ఉండగా...డ్రైవింగ్ చేసి ఏదైనా ప్రమాదానికి కారణమైనా లేదంటే డ్రైవింగ్ చేస్తూ పోలీసులకు పట్టుబడితే కేసుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అధికారులు తెలిపారు. యువత చదువులు, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళుతుంటారు. ఆయా దేశాల్లో డ్రైవింగ్ చేయాలంటే అంతర్జాతీయ లైసెన్సులు తీసుకోవాలి. లైసెన్సు సస్పెన్షన్‌లో ఉంటే.. అంతర్జాతీయ లైసెన్సు పొందడం చాలా కష్టమని పేర్కొంటు న్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని లేదంటే మూల్యం తప్పదని హెచ్చరిస్తున్నారు.

# 1.74 లక్షల ఎకరాలు దాటిన వరి సాగు



ఎల్లారెడ్డిపేట : సమృద్ధిగా సాగునీరు లభించడంతో అన్నదాతలు యాసంగిలో కూడా వరి పంటపైనే దృష్టి సారించారు. దీంతో ఇతర ఆరు తడి పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. ఇప్పటి వరకు జిల్లాలో వరిసాగు 1,74,070 ఎకరాలకు చేరింది. సాధారణంగా ఫిబ్రవరి రెండో వారం వరకు వరినాట్ల ప్రక్రియ కొనసాగుతుంది. యాసంగిలో వ్యవసాయశాఖ అధికారులు వేసిన పంటల సాగు కార్యాచరణ ప్రణాళిక ప్రకారంగా 98 శాతం పైగా పూర్తయినట్లు చెబుతున్నారు. ఈ వరి సాగు విస్తీర్ణం పరంగా చూస్తే ఇల్లంతకుంట మండలం ప్రథమ స్థానంలో ఉండగా తంగళ్లపల్లి మండలం ద్వితీయ స్థానంలో నిలిచింది. మరికొద్ది రోజుల్లో వరినాట్లు పూర్తయ్యే అవకాశమున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో బోరుబావులు, బావులు (ఓపెన్ వెల్స్) వ్యవసాయానికి ప్రధాన ఆధారంగా నిలుస్తున్నాయి. సరిపడా నీరు లభిస్తుండటంతో వరిసాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈ యాసంగిలో ఈ నెల 4 వరకు జిల్లాలో అన్ని రకాల పంటలు 1,77,004 ఎకరాల్లో సాగైనట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. గత వానాకాలం సీజన్‌లో సన్నరకాల వడ్లకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించడంతో ఈ యాసంగిలో అత్యధిక విస్తీర్ణంలో రైతులు సన్నరకాలను సాగు చేశారు.

ఆరుతడి పంటలు, కూరగాయలు, పప్పు దినుసులు, వాణిజ్యం తదితర పంటల సాగు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

గోధుమ 52, మొక్కజొన్న 1,493, ఉలవలు 0.1, పెసర 3.2, బబ్బెర 5, శనగ 180, వేరుసెనగ 25.2, నువ్వులు 135, పొద్దుతిరుగుడు 1,041 ఎకరాల్లో సాగు చేశారు.

పది ఎకరాల్లో సన్నరకాలు...

నేను పది ఎకరాల్లో సన్నాలు, నాలుగు ఎకరాల్లో దొడ్డు రకాల వరి సాగు చేశాను. సాగునీటికి ఇబ్బంది లేదు. గత వానాకాలంలో నాలుగు ఎకరాల్లో సన్నాలు వేశాను. దిగుబడి బాగానే వచ్చింది. ప్రభుత్వం అందించిన బోనస్ సుమారు రూ.48 వేలు వచ్చింది. ఈసారి కూడా బోనస్ ఎక్కువగా వస్తుందని ఆశిస్తున్నాను.

ల్యాగల వినోద్, యువ రైతు, రాచర్ల బొప్పాపూర్

జిల్లాలో మండలాల వారీగా వరిసాగు (ఎకరాల్లో)

గంభీరావుపేట : 18,000
ఇల్లంతకుంట : 24,000
ముస్తాబాద్ : 20,000
సిరిసిల్ల : 4,500
తంగళ్లపల్లి : 18,500
వీర్నపల్లి : 6,520
ఎల్లారెడ్డిపేట : 16,850
బోయినపల్లి : 12,400
చందుర్తి : 16,000
కోనరావుపేట : 17,800
రుద్రంగి : 4,600
వేములవాడ : 4,600
వేములవాడ రూరల్ : 10,300

# బడిలోనే భవితకు నిర్దేశం



పెద్దపల్లి : 'పదో తరగతి తర్వాత ఏయే కోర్సులు అందుబాటులో ఉన్నాయి? ఎందులో చేరితే భవిష్యత్తు బాగుంటుంది?' తదితర అంశాలపై అవగాహన కల్పించడం.. విద్యార్థుల మానసిక సమస్యలు పరిష్కరించడం.. వారిని పరీక్షలకు సన్నద్ధం చేసే దిశగా విద్యాశాఖ నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'కెరీర్ కౌన్సెలింగ్, గైడెన్స్' పేరిట ప్రభుత్వ, ఆదర్శ, కస్తూర్బా పాఠశాలల విద్యార్థులకు నిర్వహించే కౌన్సెలింగ్ కోసం ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

**ఇదీ ఉద్దేశం**

విద్యార్థి భవితకు తొలిమెట్టు పదో తరగతి. చాలా మంది విద్యార్థులు సరైన మార్గదర్శనం లేకపోవడంతో కోర్సు ఎంపికలో తడబడుతున్నారు. వృత్తివిద్య, ఇతర కోర్సుల్లో అవకాశాలు తెలియకపోవడంతో విలువైన సమయం నష్టపోతున్నారు. ఇష్టం లేని కోర్సుల్లో చేరి అర్ధంతరంగా మానేస్తున్నారు. మరోవైపు యుక్త వయసులో వచ్చే శారీరక మార్పులపై అవగాహన కొరవడి సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమస్యలను గుర్తించి దిశా నిర్దేశం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**నిర్దేశించే అంశాలివీ..**

విద్యార్థుల ప్రతిభ, సామర్థ్యం, ఐచ్ఛికం, ఆర్థిక స్థితిగతులకు అనుగుణంగా కోర్సుల ఎంపికపై అవగాహన.

వృత్తివిద్య, వ్యవసాయ పాలిటెక్నిక్, ఐటీఐ తదితర కోర్సులతో అందుబాటులోని అవకాశాలపై వివరిస్తారు.మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలు వివరించడంతో పాటు పరీక్షల సమయంలో ఆందోళన చెందకుండా ఉండటానికి మానసికంగా సిద్ధం చేస్తారు.

ఆత్మవిశ్వాసం పెంపొందించడం, సమయం సద్వినియోగం చేసుకోవడంపై అవగాహన కల్పించడమే కాకుండా కళాశాల చదువులపై విద్యార్థుల్లోని భయాన్ని పోగొడతారు.

ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ

ప్రతి పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడిని ఎంపిక చేసి జనవరి 30, 31 తేదీల్లో శిక్షణ ఇచ్చారు. వీరంతా క్షేత్ర స్థాయిలోకి వెళ్లి పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మార్గదర్శనం చేయనున్నారు. పరీక్షలు సమీపిస్తున్నందున మానసిక స్థైర్యం నింపనున్నారు. కోర్సులు ఎలా ఎంపిక చేసుకోవాలో తెలియక సతమతమవుతున్న విద్యార్థులకు ఈ కార్యక్రమం ప్రయోజనకరంగా ఉంటుంది. ఉన్నత లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నామమాత్రంగా చేపట్టకుండా ప్రతి విద్యార్థికి చేరేలా అమలు చేస్తేనే సార్థకత చేకూరుతుంది.


**సద్వినియోగం చేసుకుంటే ఉజ్వల భవిత** కోర్సుల ఎంపిక, వ్యక్తిత్వ వికాసంపై రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చాం. ఒత్తిడిని తట్టుకొని పరీక్షలకు సన్నద్ధం చేసే విధానంపై అవగాహన కల్పించాం. సామర్థ్యాలు, నైపుణ్యాలు, ఆసక్తిని బట్టి కోర్సును ఎంపిక చేసుకునేలా ఉపాధ్యాయులు వివరిస్తారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచి నిర్ణయం తీసుకుంటే జీవితంలో స్థిరపడతారు. మల్లేశం, ప్రధానోపాధ్యాయుడు, రాష్ట్ర రీసోర్స్‌పర్సన్, బాలికల ఉన్నత గోదావరిఖని

# సాలార్‌జంగ్ మ్యూజియం.. ఆన్‌లైన్‌లో చూసేద్దాం

హైదరాబాద్: పురాతన వస్తువులు, చిత్రాలు చూడాలని చాలా మందికి ఆసక్తి ఉంటుంది.. వెసులుబాటు లేక సుదూర ప్రాంతాలకు వెళ్లి చూడలేని పరిస్థితి. ఈ నేపథ్యంలోనే గూగుల్ వినూత్న పరిష్కారం తీసుకువచ్చింది. ఆర్ట్స్, కల్చర్‌లో భాగంగా ప్రఖ్యాత సాలార్‌జంగ్ మ్యూజియానికీ చోటు కల్పించింది. అక్కడి అరుదైన వస్తువుల ప్రత్యేకతలను వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేశారు.

**వివరాలను తెలుపుతూ..**

వెబ్‌సైట్‌లో.. ప్రతి వస్తువుకు సంబంధించిన టైటిల్, ఎక్కడ తయారు చేశారు? ఏ కాలం నాటిది? దాని ప్రత్యేకత.. లాంటి వివరాలన్నీ తెలుసుకోవచ్చు.మ్యూజియంలో భద్రపరిచిన 'సింబల్స్ ఆఫ్ గ్లోరీ' పేరుతో రాజుల దర్పం ప్రతిబింబించేలా సుమారు వెయ్యికిపైగా అరుదైన, ప్రాచీన వస్తువులు వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేశారు.'వండర్స్ ఆఫ్ వుడ్' పేరుతో నాడు రాజులు ఆడిన చెస్ బోర్డు, రెండో నిజాం



సాహస యాత్ర, రాయల్ దక్కనీ కళా పోషణకు వివరాలను డిజిటలైజ్ చేశారు.మ్యూజిక్ ఆఫ్ బ్రాంజ్, ఇండియన్ ఎపిక్స్ ఇన్ ఆర్ట్స్, ఎ గేమ్ ఆఫ్ థ్రోన్స్, హౌ చెస్ కాంకర్డ్ వరల్డ్, భారతదేశ, తెలంగాణ, నిజాం చరిత్రకు సంబంధించిన 1,000కి పైగా చిత్రాలు అందుబాటులో ఉన్నాయి. వివరాలను %https://artsandculture.google.com/partner/salar-jung-museumలో చూడవచ్చు. వెబ్‌సైట్‌లోకి వెళ్లగానే వివిధ రకాల వస్తువులు ప్రత్యక్షమవుతాయి. కావాల్సిన దానిపై నొక్కగానే ఆ వస్తువుకు సంబంధించిన మొత్తం సమాచారం తెలుసుకోవచ్చు.

# 'ఆటో' ఇటో పడితే ఆసుపత్రికే!

కరీంనగర్ : చాలామంది ఆటోల్లో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ఇటీవల గొల్లపల్లి మండలంలో ఆటోలో నుంచి కిందపడి చిన్నారి మృతిచెందిన ఘటన తీవ్ర విషాదం నింపింది. కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు ఆటోలను అద్దెకు మాట్లాడుకొని వారి పిల్లలను అందులో పంపిస్తున్నా.. పరిమితికి మించి ప్రయాణిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. తిమ్మాపూర్ మండలంలో మూడు ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు ఉండగా.. బస్సులు సకాలంలో రాకపోవడం, వచ్చినవాటిలో ప్రయాణికులు అధికంగా ఉండటంతో విద్యార్థులంతా



ఆటోలపైనే ఆధారపడుతున్నారు. ఇంటికి త్వరగా వెళ్లాలనే ఆత్రుతలో ఇబ్బందులు పడుతూ ప్రయాణిస్తున్నారు. కళాశాలల సమీపంలోనే ఆర్టీఏ కార్యాలయమున్నా.. దీనిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు తనిఖీలను ముమ్మరం చేయడంతోపాటు వాహనచోదకులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన అవసరముంది.

# నిరంతర నీరు.. లీకేజీలతో బేజారు

కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా హౌసింగ్‌బోర్డు కాలనీ రిజర్వాయర్ల పరిధిలో 24 గంటల తాగునీటి సరఫరా విజయవంతంగా కొనసాగుతోంది. రూ.18 కోట్లతో పనులన్నీ పూర్తి చేయగా కాలనీతోపాటు ఆమేర్‌నగర్, గాయత్రీనగర్, షాషాబ్‌వీధిలో ఇంటింటా కనెక్షన్లు పునరుద్ధరించారు. ప్రతి ఇంటికి మీటర్లు బిగించగా, దాని ఆధారంగానే నిరంతర నల్లా నీరు సరఫరా చేస్తున్నారు.

ఇటీవలే ప్రారంభం

నగరంలోని హౌసింగ్‌బోర్డుకాలనీ కేంద్రంగా నిరంతర తాగునీటిని సరఫరా చేసేందుకు 14 రోజుల కిందట అప్పటివరకు మేయర్‌గా కొనసాగిన వై.సునీల్‌రావు కేంద్ర, రాష్ట్ర మంత్రులతో ప్రారంభోత్సవం చేయించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు నీటి సరఫరా చేస్తున్నారు. అర్ధరాత్రి నాలుగు గంటలు నిలిపి వేసి, వేకువజామున 4 గంటల నుంచి యథావిధిగా నీటి సరఫరా చేస్తున్నారు. సుమారు 2,240 ఇళ్లకు నల్లా విప్పితే చాలు నీరు వస్తుంది. అయితే కొందరు నీటిని వృథా చేస్తుండగా, మరికొందరు నల్లాలకు బిరడాలు బిగించుకొని పొదుపు చేస్తున్నారు.

**కనెక్షన్లు ఊడిపోతుండటంతో..**

కాలనీలో ఉన్న రెండు ట్యాంకులను రెండు జోన్లుగా పిలుస్తుండగా ఈ ప్రాంతంలో పనులు పూర్తయ్యాయి. 2.310 కిలోమీటర్ల పొడువునా హెచ్‌డీపీఈ పైపులైను వేశారు. ఏడు బల్క్ ఫ్లో మీటర్లు, ఆరు చోట్ల 100ఎంఎం డయా గేట్‌వాల్వులు వేశారు. రిజర్వాయర్ల దగ్గర రెండు ఫ్లో మీటర్లు ఏర్పాటు చేశారు. ఇంటికి, అంతర్గత పైపులైనుకు ఇచ్చిన కనెక్షన్లు ఊడిపోవడంతోనే ప్రధాన సమస్యగా మారుతోంది. ప్రస్తుతం రెండు చోట్ల పెద్ద లీకేజీలు ఉండగా, మిగతా పది చోట్ల చిన్న, చిన్న లీకేజీలు ఉన్నాయి. కొత్తగా సీసీ రోడ్లు వేయగా రహదారి మధ్యలో ఉన్న పైపులైన్ల దగ్గరి నుంచి కూడా నీరు బయటకు వస్తుండటంతో ఏ విధంగా పరిష్కరించాలనే ఆలోచనలో పడ్డారు. నీటి ఒత్తిడి ఉంటుండటంతోనే లీకేజీల సంఖ్య పెరుగుతుందని చెబుతున్నారు.

ఎప్పటికప్పుడు మరమ్మతులు

హౌసింగ్ బోర్డుకాలనీలో నిరంతరం నీటి సరఫరా చేస్తుండటంతో లీకేజీలు బయట పడుతున్నాయి. ఏ ప్రాంతానికి ఆ ప్రాంతంలో వాల్వులు బంద్ చేసి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తున్నారు. నీటి వృథా చేయకూడదని, అవసరం మేరకు నీటిని నింపుకొని నల్లాలు బంద్ చేయాలని కోరుతూ ఆటోల ద్వారా ప్రచారం చేస్తున్నాం. ఓంప్రకాశ్, డీఈఈ, నగరపాలిక

## చర్లపల్లి టెర్మినల్ ప్రారంభమైనా.. కొలిక్కిరాని రహదారి విస్తరణ

హైదరాబాద్ : అనేక వాయిదాల తర్వాత చర్లపల్లి టెర్మినల్ సోమవారం ప్రధాని మోదీ చేతులమీదుగా (వర్చువల్‌గా) ప్రారంభమైంది. విమానా శ్రయాన్ని తలపించేలా సుమారు రూ. 430 కోట్లతో టెర్మినల్ నిర్మించారు. 25 జతల రైళ్లను నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే ప్రణాళికలు రచిస్తోంది. తద్వారా సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వేస్టేషన్లపై ఒత్తిడి తగ్గనుంది. ప్రయాణికుల రాకపోకలకు మరికొన్ని రోజులు ప్రయాస తప్పేలా లేదు. చర్లపల్లి స్టేషన్‌కు వెళ్లే అప్రోచ్ రోడ్ల పనులు ముందుకు కదలడం లేదు. ప్రారంభోత్సవంలో కేంద్ర, రాష్ట్ర మంత్రుల ప్రసంగాలు చర్చకు దారితీసాయి. రోడ్డు విస్తరణకు కేంద్రం గ్రాంట్ విడుదల చేయాలని ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు కోరగా..అది మీ బాధ్యతే అంటూ రైల్వే సహాయమంత్రి వి.సోమన్న బదులిచ్చారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఈ అంశంపె ప్రసంగించారు. భారాస ప్రభుత్వా



నికి అనేక లేఖలు రాశానని, ప్రస్తుత ప్రభుత్వానికీ లేఖ రాశానని అన్నారు. **8.23 ఎకరాలు అప్పగించిన అటవీశాఖ..** టెర్మినల్ ముఖద్వారం దక్షిణం వైపు ప్రతిపాదించిన 100 అడుగుల రహదారి విస్తరణకు ఐవోసీఎల్, బీపీసీఎల్ మధ్యఉన్న అటవీభూములను స్వాధీనం చేసుకోవడంతో పాటు 14 పరిశ్రమలను తరలించి రహదారి విస్తరించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఈనెల 4న 8.23 ఎకరాలను అటవీశాఖ అప్పగించిందని ఐలా కమిషనర్ ప్రభాకర్ తెలిపారు.

**బస్సులు నడిపేందుకు ఆర్టీసీ కసరత్తు..** ఇప్పటికే ఆర్టీసీ అధికారులు ఆయా మార్గాలను పరిశీలించి నివేదిక పంపారు. ముఖద్వారం వైపు బస్సుల రాకపోకలకు అనువైన రోడ్లు లేవని నివేదించారు. సోమవారం ఉన్నతాధికారులు రైల్వే అధికారులను కలిశారు. మంగళవారం ఈఅంశంపై స్పష్టత రానుందన్నారు.

## నిబంధనలా.. అవెలా ఉంటాయ్?

హైదరాబాద్ : ప్రభుత్వ భూములకు రెక్కలొస్తున్నాయి. కబ్జాదారుల చెరలోకి వెళ్లిపోతున్నాయి. ఏకంగా సర్కారు స్థలంలో రెడీమిక్స్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి వ్యాపారమే చేస్తున్నా యంత్రాంగం కన్నెత్తిచూడటం లేదు. హిమాయత్ సాగర్‌కు కూతవేటు దూరంలో హైదరాబాద్–బీజాపూర్ రహదారికి సమీపంలో ఓ రెడీమిక్స్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 176లో పది ఎకరాలు ఆక్రమించారు. ఇక్కడ ఎకరా రూ. 20 కోట్ల వరకు ఉంటుందని, ఈ లెక్కన కబ్జా చేసిన భూమి విలువ రూ. 200 కోట్ల వరకు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

ఈ సర్వే నంబర్‌లో 162 ఎకరాలుండగా అసైనీలకు కేటాయించారు. ఈ భూములను కొన్నేళ్లుగా ఎవరూ సాగు చేయకపోవడంతో ప్రస్తుతం



ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. దీంతో అక్రమార్కుల కన్ను వీటిపై పడింది. కొద్దినెలల క్రితం రెడీమిక్స్ ప్లాంట్‌ను పెట్టారు. తాము ప్లాంటు కోసం దరఖాస్తు చేసుకున్నామని, అనుమతులొచ్చాయని అధికారులను నమ్మించి వెంటనే కార్యకలాపాలూ ప్రారంభించారు.

**పరిశ్రమలు... నిర్మాణాలపై నిషేధమున్నా...**

జంట జలాశయాల పరిరక్షణ కోసం గత ప్రభుత్వాలు 111జీవోను అమలు చేస్తున్నాయి. దీని ప్రకారం జలాశయాల పరిధిలో ఎలాంటి నిర్మాణాలు, పరిశ్రమలు ఉండకూడదు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే రెవెన్యూ, పరిశ్రమల శాఖ అధికారులు వాటిని తొలగించి యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. ఇవేమీ తమకు వర్తించవన్నట్లు కొందరు ప్రైవేటు వ్యక్తులు రెడీమిక్స్ ప్లాంట్‌ను ప్రారంభించారు.

**ప్రజాప్రతినిధుల అండతోనే...**

రెడీమిక్స్ ప్లాంట్‌ను ఎవరు ఏర్పాటు చేశారో... ఎవరు నిర్వహిస్తున్నారో స్థానికుల్లో చాలామందికి తెలియదు. సమీపంలోని అజీజ్‌నగర్ వాసులను వాకబు చేయగా.. ఇద్దరు ప్రజాప్రతినిధుల సహకారంతోనే ఏర్పాటు చేశారని తెలిపారు. దీనిపై మొయినాబాద్ తహసీల్దార్ కె.గౌతమ్ కుమార్‌ను వివరణ కోరగా.. రెడీమిక్స్ ప్లాంట్ ఏర్పాటు విషయం తమకు తెలియదని, సర్వే నంబరు 176 పూర్తిగా ప్రభుత్వ భూమేనని స్పష్టం చేశారు. నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## పైలట్ ప్రాజెక్టుగా పంటల సర్వే

జగిత్యాల : జిల్లాలో యాసంగి పంటలను రైతులు పెద్దఎత్తున సాగుచేస్తుండగా పైర్ల నమోదు ప్రక్రియను చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. రాష్ట్రప్రభుత్వ ఆదేశాల ప్రకారం మండలానికి ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా గ్రామంలో సాగుచేసిన పంటల వివరాలు నమోదు చేస్తారు. మండల వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో ఏఈవో గ్రామంలోని సర్వే నంబరులోని పొలం వద్దకు వెళ్లి పోర్టల్‌లో సూచించిన వివరాలు నమోదు చేయాలి. ఉపగ్రహ సాయంతో సెల్‌ఫోన్ లేదా ట్యాబ్‌లలో ప్రత్యేక పోర్టల్‌లో రెండుమూడు రోజుల్లోగా వివరాలన్నీ నమోదు చేయాల్సి ఉంది. రైతు పేరు, సర్వే నంబర్లవారీగా సాగుచేసిన పంటలు, ఎన్ని ఎకరాల్లో సాగుచేశారు, సాగుచేయని విస్తీర్ణం తదితర వివరాలన్నీ నమోదు చేయాల్సి ఉంటుందని వ్యవసాయశాఖ జిల్లా అధికారి సీహెచ్.రాంచందర్ తెలిపారు. సర్వేలో ఏవేని అవాంతరాలు ఏర్పడితే రాష్ట్ర ఉన్నతాధికారులకు సమాచారం అందించాల్సి ఉంటుంది. జిల్లాలో ప్రస్తుతం ఎంపికచేసిన అన్ని గ్రామాల్లో 13,674 ఎకరాల భూమి ఉండగా 500 ఎకరాలకన్నా తక్కువగా భూమి ఉంటే పూర్తిగా సర్వేచేసి నమోదు చేయాలి. 500 ఎకరాలకన్నా ఎక్కువ భూమి ఉంటే కనీసం 500 ఎకరాల్లో సర్వేచేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం పంటలను సాగు చేసిన భూములకే రైతుభరోసా పెట్టుబడిసాయం నిధులను విడుదల చేస్తామని పేర్కొన్న నేపథ్యంలో ఈ సర్వే ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఇసుక తరలిపోతున్నది!



తాండూరు: తాండూరు నియోజకవర్గం కాగ్నా, కాకర వేణి నదుల్లో అక్రమంగా తవ్వకాలు జరుపుతూ ఇసుకను తరలించేస్తున్నారు. గృహనిర్మాణ దారులకు విక్రయించి అక్రమార్కులు జేబులు నింపుకొంటున్నారు. రెండు నదుల నుంచి నిత్యం వేల క్యూబిక్ మీటర్ల జలసిరి తరలిపోతున్నా, అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు దందాను రెట్టింపు చేశారు. రెండు నదుల మధ్యలో చాలా చోట్ల ఇసుక వాహనాల రాకపోకల కారణంగా దారులుగా మారిపోయాయి. వ్యవసాయ పనులకు వినియోగించే ట్రాక్టర్లు కొన్ని వాణిజ్యపరమైన కార్యకలాపాల పరిధిలోకి వచ్చే ఇసుక తరలిస్తున్నా పట్టించుకోవడం లేదు.

**అనుమతుల పేరిట అడ్డగోలుగా:** జిల్లాలో తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల కోసమని కాగ్నా, కాకరవేణి నదుల నుంచి ఇసుకను తరలించేందుకు రెవెన్యూ అధికారులు అనుమతులు ఇచ్చారు. అయితే తరలింపుపై పర్యవేక్షణ ఉండడంలేదు. అనుమతి పొందిన వ్యాపారులు నిర్ణీత ప్రదేశానికి బదులు ప్రైవేటు పనులకే ఎక్కువగా తరలిస్తున్నారు. ట్రాక్టరు ఇసుకకు దూరాన్ని బట్టి రూ. 5,000 నుంచి రూ. 6,000 వరకు విక్రయిస్తున్నారు. ఇక వీరికి తోడు అనుమతి లేని వారు కూడా నదుల్లోంచి దర్జాగా కొల్లగొట్టి విక్రయిస్తున్నారు. ఇలా ఒక్క రోజు 300 ట్రిప్పుల ఇసుక తరలిపోతోంది. ఈ లెక్కన ఒక్క రోజులోనే రూ. 15లక్షల నుంచి రూ. 18లక్షలు సంపాదిస్తున్నారు. తాండూరులో ఓ భవన నిర్మాణం పేరిట నిత్యం తరలిస్తున్నారు. ఇందులో ఎక్కువగా పక్కదారే పడుతోంది.

**ఎక్కడెక్కడ అంటే**

యాలాల మండలం బెన్నూరు, దేవనూరు, విశ్వనాథ్‌పూర్, సంగెం కుర్దు, యాలాల, గోవిందరావు పేట, తాండూరు మండలం బిజ్వార్, ఖాంజాపూరు, అగ్గనూరు, పాత తాండూరు, పెద్దేముల్ మండలం మదనంతపూరు, రేగొండి, రుక్మాపూరు, మన్‌సాన్‌పల్లి, బషీరాబాద్ మండలం జీవన్గి, నవాంధ్గి, గంగ్వార్, క్యాద్గిర.

**రాయల్టీ పేరిట దందా** తాండూరు, వికారాబాద్, పరిగి నియోజకవర్గ కేంద్రాలకు భద్రాచలం, నిజామాబాద్ తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు గనుల శాఖకు రాయల్టీ చెల్లించి లారీల్లో తరలిస్తున్నారు. ఇదే ఇసుకను కొందరు డబ్బులు చెల్లించి గృహాల నిర్మాణాలకు కొనుగోలు చేస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి లారీల్లో వచ్చిన ఇసుక ఖాళీ చేసిన వ్యాపారులు రాయల్టీ పత్రాన్ని మాత్రం తమ వద్దే ఉంచుకుంటున్నారు. అయితే తాండూరు నియోజకవర్గంలోని కాగ్నా, కాకర వేణి నదుల నుంచి తరలించి రహస్య ప్రాంతాల్లో డంపు చేసిన ఇసుకను సదరు లారీల్లో నింపి దర్జాగా అడ్డాపై నిలువరించి యథేచ్ఛగా విక్రయించి సొమ్ము చేసుకుం టున్నారు. ఒక్కో లారీ ఇసుకను రూ. 25వేల నుంచి రూ. 30వేల వరకు విక్రయిస్తున్నారు. ఇలా ప్రతి రోజు 5 నుంచి 10 లారీలు అక్రమంగా అమ్ముతున్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేస్తే పట్టుబడే అవకాశం ఉన్నా, ఇది జరగడం లేదు. అడ్డాల్లోని లారీల్లో ఉన్న ఇసుక నమూనాలను ప్రయోగశాలల్లో పరిశీలించినా బండారం బయటపడే అవకాశం ఉన్నా చేయడం లేదు.

# హనీట్రాప్.. ఆపై రూ.కోట్ల స్కామ్




హైదరాబాద్: మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లలో జీవిత భాగస్వామి కోసం వెతికే పురుషులే వారి లక్ష్యం. తెలుగులో మాట్లాడుతూ.. విదేశాల్లో ఉంటున్నట్లు నమ్మించి మోసం చేస్తారు. ఇద్దరం కలిసి బాగా సంపాదిద్దామంటూ బిట్‌కాయిన్, స్టాక్ ట్రేడింగ్‌లో పెట్టుబడుల పేరిట రూ.కోట్లు కొట్టేస్తారు ఈ సైబర్ మోసగాళ్లు. మ్యాట్రిమోనీ వేదికలు.డేటింగ్ యాప్‌లలో యువతుల్లా నటిస్తూ హనీట్రాప్ చేస్తున్నారు. **అందమైన ఫొటోలతో..** ఇటీవల పెళ్లి సంబంధాల కోసం మ్యాట్రిమోనీ వేదికల్ని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. దీనికితోడు డేటింగ్ యాప్‌ల వినియోగం అధికమవుతోంది. ఇదే అదునుగా నేరగాళ్లు నకిలీ ఫొటోలు సృష్టిస్తున్నారు. ఆన్‌లైన్‌లో అందమైన యువతుల ఫొటోలు సేకరించి డీపీలుగా పెడతారు. ఈ ఖాతాల ద్వారా పెళ్లి, స్నేహానికి తాము సుముఖంగా ఉన్నామంటూ సందేశాలు పంపిస్తారు. వ్యక్తిగత వివరాలు సేకరిస్తారు. ఈ క్రమంలో తాము ఇటీవల స్టాక్ ట్రేడింగ్, బిట్‌కాయిన్‌లో పెట్టుబడులతో బాగా సంపాదించినట్లు చెబుతారు. ఈసారి ఇద్దరు కలిసి పెట్టుబడులు పెట్టి సంపాదిస్తే భవిష్యత్తులో స్థిరపడొచ్చంటారు. వారే కొన్ని వెబ్‌సైట్లను సూచించి రిజిస్టర్ చేయిస్తారు. వీటిలో పెట్టుబడి పెట్టిన ప్రతిసారీ దానికి లాభాలు వచ్చినట్లు వర్చువల్‌గా చూపిస్తుంది. విత్‌డ్రాకు అవకాశం ఉండదు. బాధితులు నగదు పంపడం ఆపేస్తే పత్తా లేకుండా పోతారు.

**పురుషులే లక్ష్యం ఎందుకంటే..?**

లేటు వయసులో భాగస్వామి కోసం వెతికేవారు, విడాకుల తర్వాత రెండోసారి వివాహం చేసుకునే పురుషులే లక్ష్యంగా ఈ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వారిలోనూ ఎక్కువగా సంపన్నులే ఉంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో వారి నేపథ్యం, బాధితులతో మాట్లాడినప్పుడు ఒంటరిగా ఉంటున్నారా అని పరిశీలించాకే నేరగాళు రంగంలోకి దిగుతారు.

**ఇలా మోసపోయారు**

మాదాపూర్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి(46) వివాహం కోసం తెలుగు మ్యాట్రిమోనీని ఆశ్రయించాడు. గతేడాది ఆగస్టు రెండో వారంలో బ్రిటన్‌లో నివాసం ఉంటున్నట్లు మీనాక్షి పరిచయమైంది. పెళ్లి చేసుకోవడానికి సంసిద్ధత వ్యక్తం చేసిన మీనాక్షి.. పరిచయం పెంచుకుని కొన్ని రోజులు మాట్లాడింది. ఈ క్రమంలోనే తాను క్రిప్టో ట్రేడింగ్‌లో బాగా డబ్బు సంపాదించినట్లు చెప్పింది. నిజమని నమ్మిన ఉద్యోగి ట్రేడింగ్‌కు సిద్ధమయ్యాడు. ఆమె చెప్పినట్లు నకిలీ వెబ్‌సైట్లో రిజిస్టర్ చేసుకుని దశలవారీగా రూ. 94.51 లక్షలు పెట్టుబడి పెట్టాడు. దీనికి ఐదురెట్లు లాభం వచ్చినట్లు కనిపిస్తున్నా.. విత్‌డ్రా చేసుకోడానికి వీలులేదు. బాధితుడు మోసపోయాడని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నగరంలో నివాసం ఉంటున్న ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగికి సామాజిక మాధ్యమంలో ఓ మహిళ పరిచయమైంది. ఫారెక్స్ ట్రేడింగ్ చేసి సంపాదించినట్లు చెప్పింది. నకిలీ వెబ్‌సైట్‌లో రూ. 1.89 కోట్లు పెట్టుబడులు పెట్టించింది. లాభాలు రాలేదు. అసలు కూడా వెనక్కి తీసుకోడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

2024లో మ్యాట్రిమోనీ మోసాల కేసుల సంఖ్య
హైదరాబాద్: 12
సైబరాబాద్: 53 రాచకొండ: 40

# స్లిప్పు తీసుకొని నేరుగా వైద్యుని వద్దకే



హైదరాబాద్: నిమ్స్‌లో ఓపీ అంటే బీపీ తప్పదు. నిత్యం 2500–3000 మంది వరకు రానుండటంతో ఓపీ కార్డు కోసం నిరీక్షణ తప్పదు. గంటల తరబడి క్యూలో ఉంటే తప్ప ఓపీ కార్డు పొందే అవకాశం లేదు. కొందరైతే ముందురోజు వచ్చి చెట్ల కింద ఉంటూ ఉదయమే ఓపీ కోసం వరుసలో నిలబడి స్లిప్పు తీసుకొని వైద్యులను సంప్రదిస్తున్నారు. ఈక్రమంలో రోగులు ఎన్నో వ్యయ ప్రయాసలు ఎదర్కొంటున్నారు. ముఖ్యంగా దూరప్రాంతం నుంచి వచ్చిన రోగులకు అగచాట్లు తప్పడం లేదు. ఈ ఇబ్బందులకు త్వరలోనే మోక్షం లభించనుంది. ఓపీ సేవలను మరింత చేరువ చేసేందుకు నిమ్స్‌లో కియోస్క్‌లు అందుబాటులోకి తెస్తున్నారు. ఇప్పటికే వీటిని ప్రయోగాత్మకంగా పరిశీలించారు. తొలుత రివ్యూ కోసం వచ్చే రోగులకే పరిమితం చేశారు. సానుకూలత రావడంతో మిగతా రోగులకూ అందుబాటులోకి తెస్తున్నారు. మిలీనియం బ్లాక్ వద్ద 2 యంత్రాలను ఈనెల 26 నుంచి అందుబాటులోకి తేనున్నారు. టెండర్ల ప్రక్రియ నడుస్తోంది. ఒకటి, రెండు రోజుల్లో ఇది పూర్తి కానుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ తరహా కొత్త సాంకేతికత ఇదే తొలిసారి అని వైద్యులు తెలిపారు. రోగులకు **తప్పనున్న నిరీక్షణ**

ప్రస్తుతం పాత భవనంతోపాటు సూపర్ స్పెషాలిటీ బ్లాకుల వద్ద ఓపీ సేవలు అందుబాటులో ఉన్నాయి. కౌంటర్ వద్దకు వెళ్లి నిర్ణీత రుసుం చెల్లించి కార్డు తీసుకొని మళ్లీ వైద్యుని కోసం వేచి చూడాలి. కొన్నిసార్లు వైద్యుని కలిసి పరీక్షల రిపోర్టులు తీసుకొని మళ్లీ డాక్టర్‌ని చూపించే సరికే రోజు గడుస్తోంది. మళ్లీ రెండోరోజు రావాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. ఎంతో దూరం నుంచి వచ్చినవారు ఆసుపత్రి షెడ్డుల్లోనే గడుపుతున్నారు. మరుసటిరోజు సదరు వైద్యుడు రాకపోతే ఇంటికి వెళ్లి రెండు, మూడు రోజుల తర్వాత మళ్లీ వస్తున్నారు. కియోస్క్‌ల ఏర్పాటుతో ఓపీ స్లిప్పు పొందడం సులువని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప తెలిపారు. రోగి వివరాలు, సమస్య నమోదు చేసి ఆన్‌లైన్‌లో నిర్ణీత ఓపీ రుసుం చెల్లించిన తర్వాత ఒక స్లిప్పు వస్తుంది. దానిని తీసుకొని నేరుగా సంబంధిత విభాగం వద్దకు వెళ్లి వైద్యుని సంప్రదించవచ్చునన్నారు. గంటల తరబడి క్యూలో నిల్చొనే అవసరం ఉండదన్నారు. కియోస్క్‌ల వినియోగంలో రోగులకు సాయం అందించేందుకు సహాయకులను నియమించనున్నారు. నిమ్స్‌లో 27పైనే విభాగాలున్నాయి. అన్ని విభాగాల ఓపీ స్లిప్పులు ఈ కియోస్క్‌లతో పొందవచ్చు. అవసరాన్నిబట్టి మరిన్ని కియోస్క్‌లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

## నిధులున్నా నిర్మాణం సాగట్లే..

కామారెడ్డి: సకల సౌకర్యాలతో బాన్సువాడ పట్టణంలో నూతన గ్రంథాలయం నిర్మించేందుకు గతేడాది పాత భవనాన్ని కూల్చివేశారు. అప్పటి నుంచి గ్రంథాలయాన్ని తాత్కాలికంగా పట్టణంలోని స్టేడియం గదిలో అరకొర వసతుల మధ్య నిర్వహిస్తున్నారు. దీంతో పోటీపరీక్షలకు సిద్ధమయ్యే ఉద్యోగార్థులు, పాఠకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టి సారించాల్సిన ఆవశ్యకతపై కథనం.

**సమస్యలు అధికం..**

జిల్లా కేంద్రంలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన గ్రంథాలయం ఉంది. దీనిని డిజిటల్‌గా మార్చేందుకు యంత్రాంగం కసరత్తు చేస్తోంది. కాని జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గ విద్యార్థులు, ఉద్యోగార్థులకు కేంద్రంగా ఉన్న బాన్సువాడ గ్రంథాలయానికి మాత్రం శాశ్వత భవనం లేక ఇబ్బందికరంగా మారింది. ప్రస్తుతం తాత్కాలికంగా నిర్వహిస్తున్న స్టేడియంలో చదువుకునేందుకు అనువైన వాతావరణం, పాఠకుల సంఖ్యకు సరిపడా స్థలం లేకపోవడంతో సమీపంలోని చెట్ల కింద విద్యార్థులు కూర్చోవాల్సి వస్తోంది. ప్రభుత్వం ఉద్యోగార్థుల ప్రయోజనార్థం రూ.లక్షల విలువైన పుస్తకాలను గ్రంథాలయాలకు పంపగా.. వాటిని భద్రపరిచేందుకు కూడా స్థలం లేకపోవడంతో సంచుల్లో నిల్వ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల స్టేడియంలో ఇతర కార్యక్రమాల ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే పోచారం




శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి ఉద్యోగార్థులు, విద్యార్థులు తమ సమస్యలను తీసుకెళ్లారు. ఇదే విధంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి సైతం గ్రంథాలయ నిర్మాణం చేపట్టాల్సిన ఆవశ్యకతపై ఇంజనీరింగ్ అధికారులకు వివరించారు. దీంతో స్టేడియంలోనే పాఠకుల సౌకర్యార్థం తాత్కాలికంగా మరో షెడ్డు నిర్మాణం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శాశ్వత భవన నిర్మాణం జరిగితేనే తమ సమస్యలు తీరుతాయని ఉద్యోగార్థులు పేర్కొంటున్నారు.

**వెనక్కి వెళ్లే అవకాశం..**

సీఎం ప్రత్యేక నిధి నుంచి గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ. 40 లక్షలు, రాష్ట్ర గ్రంథాలయ సమితి నుంచి ఫర్నీచర్, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు మరో రూ. 20 లక్షల నిధులు మంజూరయ్యాయి. గతేడాది అసెంబ్లీ ఎన్నికలకు ముందు అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఏడాది పూర్తయినా నిర్మాణ పనులను గుత్తేదారు ప్రారంభించలేదు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు పనులు ప్రారంభించకపోతే మంజూరైన నిధులు వెనక్కి పోయే ప్రమాదం ఉంది. జిల్లాలో ఇప్పటికే ఎస్‌డీఎఫ్ కింద మంజూరై పనులు ప్రారంభం కాని వాటిని రద్దుచేసిన విషయం తెలిసిందే. బిల్లుల మంజూరులో జాప్యం చేస్తున్నారనే కారణంతో పనులు చేపట్టేందుకు గుత్తేదారు ముందుకు రాని పరిస్థితి. ఈ నేపథ్యంతో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించి బిల్లుల మంజూరుకు హామీ ఇచ్చి శాశ్వత భనిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## రైతు భరోసాపై కసరత్తు

కామారెడ్డి: అన్నదాతలకు రైతుభరోసా పథకంతో పెట్టుబడి సాయం పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇటీవల జరిగిన మంత్రిమండలి సమావేశంలో జనవరి 26వ తేదీ నుంచి సాగు యోగ్యమైన భూములకు మాత్రమే సాయం అందించాలనే నిర్ణయాన్ని ఆమోదించిన విషయం తెలిసిందే. దీంతో సాగు యోగ్యమైన భూముల గుర్తింపు ఏ విధంగా జరుగుతుందోనని రైతుల్లో చర్చ మొదలైంది. ప్రభుత్వ వర్గాల మౌఖిక ఆదేశాలతో వ్యవసాయేతర భూములను గుర్తించేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించే



పనిలో యంత్రాంగం నిమగ్నమైన తీరుపై కథనం..

**గుర్తింపునకు సిద్ధం..**

గత ప్రభుత్వం 2023–24 వానాకాలం సీజన్‌లో రైతుబంధు పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా 2,99,705 మంది రైతులకు చెందిన 5,22,034 ఎకరాలకు రూ. 261.66 కోట్లు, యాసంగి సీజన్‌లో రూ. 260.48 కోట్ల పెట్టుబడి సాయం వారి బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. ఇందులో వ్యవసాయేతర భూములతోపాటు నివాస స్థలాలకు సైతం రైతుబంధు వర్తింపజేశారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాగు యోగ్యమైన భూములకు మాత్రమే రైతు భరోసా వర్తింపజేయాలని నిర్ణయించింది. ఇందుకు అవసరమైన మార్గదర్శకాలను ఒకటి రెండు రోజుల్లో విడుదల చేసే అవకాశమున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో సాగేతర భూములు గుర్తించేందుకు జిల్లా యంత్రాంగం కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

**గ్రామ సభల్లో వివరాలు..**

సంయుక్త కార్యాచరణ అనంతరం గ్రామ సభల్లో రైతుభరోసా లబ్ధిదారులు, సాగు భూముల వివరాలు వెల్లడించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పథకానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు విడుదల కాలేదని జిల్లా వ్యసాయాధికారి తిరుమల ప్రసాద్ పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే పెట్టుబడి సాయం అందుతుందన్నారు.

**సమన్వయంతో ముందుకు..**

వ్యవసాయ, రెవెన్యూ, నీటిపారుదల, పురపాలక, ఆర్‌అండ్‌బీ శాఖల సంయుక్త కార్యాచరణతోనే వ్యవసాయేతర భూములను గుర్తించే ప్రక్రియ చేపట్టాలని అధికార యంత్రాంగం నిర్ణయానికి వచ్చింది. ఈ శాఖల అధీనంలోని భూములకు సంబంధించిన రికార్డులు, వివరాలను సిద్ధం చేసుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే భూ–భారతి (ధరణి) పోర్టల్‌లో సర్వే నంబర్ల ఆధారంగా ఆయా భూముల గుర్తింపు ప్రక్రియ పూర్తిచేయనున్నారు. వాణిజ్య, వ్యవసాయేతర అవసరాలకు వినియోగించే భూముల వివరాలను స్వచ్ఛందంగా సమర్పించాలని ప్రభుత్వం కోరింది. దీనికి స్పందించిన వారి భూముల వివరాలను నిర్దేశిత పోర్టల్‌లో తొలగించనున్నారు.




అమరావతి: ప్రధానమంత్రి నరేంద్రమోదీపై ఉన్న నమ్మకంతోనే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా ఘన విజయం సాధించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై ఉండవల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. ఢిల్లీ ప్రజలు సరైన సమయంలో సరైన పార్టీని ఎన్నుకున్నారన్నారు. "దేశ రాజధాని ఢిల్లీలో ప్రజలు విజ్ఞతతో ఓటు వేసి భాజపాను గెలిపించారు. దేశంలోని ప్రజలందరి ఆత్మ గౌరవానికి సంబంధించిన గెలుపు ఇది. దేశ, రాష్ట్ర రాజధానులు ప్రజల ఆకాంక్షలు తీర్చేవిగా ఉండాలి. వాతావరణ కాలుష్యం, రాజకీయ కాలుష్యం ఢిల్లీని మార్చేశాయి. సుస్థిర అభివృద్ధి విధానం ప్రధాని మోదీ అమలు చేస్తున్నారు.

1991 తర్వాత దేశంలో ఆర్థిక సంస్కరణలు వచ్చాయి. ఆర్థిక సంస్కరణలను తెలుగుబిడ్డ పీవీ తీసుకువచ్చారు. 1995-2024 మధ్య మన తలసరి ఆదాయం 9 రెట్లు పెరిగింది. సంపద సృష్టిస్తేనే ఆదాయం పెరుగుతుంది.. మౌలిక వసతులు వస్తాయి.

తెలుగు రాష్ట్రాల్లో 3వేల డాలర్ల (సుమారు రూ.2.63 లక్షలు) తలసరి ఆదాయం ఉంది. బిహార్‌లో తలసరి ఆదాయం ఇంకా 750 డాలర్లే (సుమారు రూ.65వేలు) ఉంది. టెక్నాలజీ సాయంతో మనం ముందుకెళ్లాం. మనకు ఐటీ, మౌలిక వసతులు గేమ్‌ఛేంజర్‌గా మారాయి. సరైన సమయంలో సరైన నాయకత్వం చాలా కీలకం. సుపరిపాలన ఇస్తే మంచి రాజకీయాలకు నాంది పలికినట్టే. చాలా రాష్ట్రాలను దాటుకుని గుజరాత్ తలసరి ఆదాయం పెరిగింది. స్థిరమైన పాలన, పాలసీలు, గ్రోత్ గుజరాత్ అభివృద్ధికి కారణం. కొందరు నాయకులు సంక్షేమ కార్యక్రమాల పేరుతో అవినీతి చేస్తున్నారు. కొందరు నేతల వల్ల రాజకీయాల్లో కాలుష్యం పెరుగుతోంది" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

**ఏపీ, ఢిల్లీ ప్రజలు తప్పు తెలుసుకుని కష్టాల నుంచి బయటపడ్డారు...**

"ఆప్ పాలనలో ఢిల్లీలో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయింది. కొన్ని విధానాల వల్ల అత్యంత కాలుష్య నగరంగా ఢిల్లీ మారింది. ఒకప్పుడు పంజాబ్‌కు అన్ని రంగాల్లో మంచి పేరుండేది. ఇవాళ పంజాబ్ అంటే డ్రగ్స్ గుర్తుకు వస్తున్నాయి. వైకాపా పాలనలో ఏపీలో మద్యం మాఫియా తయారైంది. ఏపీ, ఢిల్లీలో అమలు చేసిన పాలసీలకు విజయం దక్కలేదు. ప్రజల ఆకాంక్షలను వారు పట్టించుకోలేదు. ఓటేసిన పాపానికి ప్రజల భవిష్యత్తును కాటేశారు. ప్రజల అవకాశాలను పూర్తిగా నాశనం చేశారు. సంపద సృష్టించలేని, ప్రభుత్వానికి ఆదాయం పెంచలేని నేతలు ఎందుకు? ప్రజల జీవన ప్రమాణాలు, తలసరి ఆదాయం పెరుగుతూ ఉండాలి. ఏపీ, ఢిల్లీ ప్రజలు తప్పు తెలుసుకుని కష్టాల నుంచి బయటపడ్డారు. తెచ్చిన పాలసీలు ప్రజలపై ఎలాంటి ప్రభావం చూపించాయో నేతలు చర్చించాలి. పార్టీలు, నేతలు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. గుజరాత్‌లో సుస్థిర పాలనతో వృద్ధి 15 రెట్లు పెరిగింది. మంచి నాయకత్వంలో ముందుకెళ్తే 2047 నాటికి మన దేశమే నంబర్ వన్" అని చంద్రబాబు అన్నారు.




అమరావతి: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలతో ప్రధాని మోదీపై విశ్వాసం మరోసారి రుజువైందని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.

ఢిల్లీ ఎన్నికల్లో భాజపా విజయం సాధించడంపై ఆయన స్పందించారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా నిలిచేలా మోదీ పాలన సాగిస్తున్నారని కితాబిచ్చారు. మోదీ నిర్దేశించిన లక్ష్యం అందుకోవడంలో ఢిల్లీ పాత్ర అత్యంత కీలకమని చెప్పారు.

డబుల్ ఇంజిన్ సర్కార్ ద్వారా దేశ రాజధానిలో సమ్మిళిత అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. అమిత్ షా రాజకీయ అనుభవం, చాతుర్యం సత్ఫలితాలనిచ్చాయని తెలిపారు.

## ఢిల్లీ ఓటర్లకు సెల్యూట్.. అభివృద్ధి మా గ్యారంటీ: ప్రధాని మోదీ



ఢిల్లీ: 27 ఏళ్లపాటు కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీపార్టీ పాలన చూసిన ఢిల్లీ ఓటర్లు ఈసారి భాజపాకు అవకాశం ఇచ్చారు. కమలం పార్టీకి భారీ విజయాన్ని కట్టబెట్టారు. అందుకుగానూ ప్రధాని మోదీ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఢిల్లీ ఓటర్లకు సెల్యూట్ అంటూ ఎక్స్ వేదికగా సంతోషం వ్యక్తంచేశారు. భాజపాకు చరిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టిన సోదరసోదరీమణులకు అభినందనలు తెలియజేశారు. ఇక అభివృద్ధి తమ గ్యారంటీ అన్నారు. "అభివృద్ధి, సుపరిపాలన విజయం సాధించాయి. ఈ భారీ విజయం కోసం నిర్విరామంగా పనిచేసిన కార్యకర్తల పట్ల గర్వంగా ఉంది. ఢిల్లీ అభివృద్ధికి, ప్రజల జీవితాలు మెరుగుపరచడానికి అహర్నిశలు శ్రమిస్తామని హామీ ఇస్తున్నాం. అలాగే భారత్ అభివృద్ధిలో ఢిల్లీ ముఖ్యపాత్ర పోషించనుంది. ఇక్కడ ప్రజలకు సేవ చేయడానికి అంకితభావంతో ముందుకు వెళతాం" అని మోదీ తన పోస్టులో పేర్కొన్నారు. 70 స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న ఎన్నికలు జరిగాయి. ఎగ్జిట్‌పోల్స్ అంచనాలను నిజం చేస్తూ అసెంబ్లీ ఎన్నికల్లో ఢిల్లీ ఓటర్లు భాజపాకు పట్టం కట్టారు. శనివారం వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో భాజపా మ్యాజిక్ ఫిగర్ దాటేసింది. వరుసగా నాలుగోసారి అధికారంలోకి రావాలనుకున్న ఆమ్ ఆద్మీ పార్టీ ఆశలకు భాజపా గండికొట్టింది.

## ఓడినా ప్రజల వెంటే ఉంటాం: కేజ్రీవాల్




ఢిల్లీ: ప్రజా సేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చామని.. ఎన్నికల్లో ఓడినా ప్రజల వెంటే ఉంటామని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీ ప్రజల తీర్పును శిరసావహిస్తామన్నారు. పదేళ్లలో ఢిల్లీ ప్రజల కోసం ఎంతో చేశామని చెప్పారు.

విద్య, వైద్య మౌలిక సదుపాయాల కోసం ఎంతో కృషి చేసినట్లు వెల్లడించారు. నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను భాజపా అమలు చేయాలన్నారు. గెలిచిన భాజపా నేతలకు ఈ సందర్భంగా కేజ్రీవాల్ శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో గట్టిగా పోరాడిన ఆప్ నేతలు, కార్యకర్తలకూ కేజ్రీవాల్ ధన్యవాదాలు తెలిపారు.

## హైకోర్టు ఆదేశాలు.. భీమిలి బీచ్‌లో ఆక్రమణలు, కట్టడాలపై జీవీఎంసీ సర్వే

విశాఖపట్నం: సీఆర్‌జడ్ నిబంధనలకు విరుద్ధంగా భీమిలి బీచ్‌లో నిర్మాణాలు చేపట్టారని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. హైకోర్టు ఆదేశాలతో భీమిలి బీచ్‌లో జీవీఎంసీ అధికారులు శనివారం సర్వే చేపట్టారు. సీఆర్‌జడ్, ఆర్‌డీవో, పీసీబీ, మున్సిపల్ అధికారులు సర్వేలో పాల్గొన్నారు. విశాఖ జిల్లా భీమిలి తీర ప్రాంతంలో కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జడ్) పరిధి ఎంతో సర్వే చేయాలని, అక్రమ నిర్మాణాలుంటే కూల్చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారంపై వారంలో నివేదిక ఇవ్వాలని స్పష్టం చేసింది. విశాఖ జిల్లాలో సీఆర్‌జడ్ పరిధిని తేల్చి, అందులో అక్రమ నిర్మాణాలను కూల్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక శాఖ అధికారులు మరొక శాఖపై బాధ్యతను నెట్టుకుంటూ అలసత్వం ప్రదర్శిస్తున్నారని, ఇకనైనా మేల్కొనాలని ఘాటుగా వ్యాఖ్యానించింది. సీఆర్‌జడ్ పరిధిని తేల్చడానికి ఇబ్బందేంటని సూటిగా ప్రశ్నించింది.

ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఏపీసీజడ్‌ఎంఏ), జీవీఎంసీ కమిషనర్, విశాఖ జిల్లా కలెక్టర్‌తో కమిటీని ఏర్పాటు చేసింది. నిబద్ధత గల అధికారుల బృందంతో సర్వే చేయించాలని కమిటీకి స్పష్టం చేసింది. ప్రస్తుతం సర్వేను భీమిలికి పరిమితం చేస్తున్నామని, తర్వాత భీమిలి నుంచి విశాఖలోని ఆర్‌కే బీచ్ వరకు సర్వే చేయిస్తామని తేల్చి చెప్పింది. నివేదిక ఇవ్వడంలో విఫలమైతే తదుపరి విచారణకు హాజరుకావాలని కమిటీ సభ్యులను ఆదేశించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. భీమిలి బీచ్ వద్ద సముద్రానికి అతి సమీపంలో సీఆర్‌జడ్ నిబంధనలకు విరుద్ధంగా వైకాపా మాజీ నేత విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి కాంక్రీట్ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని జనసేన కార్పొరేటర్ పీఎల్‌వీఎన్ మూర్తి యాదవ్ గతంలో హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. భీమునిపట్నం (భీమిలి) సీఆర్‌జడ్ జోన్ పరిధిలో శాశ్వత రెస్టోబార్ల ఏర్పాటుతో తాబేళ్ల ఉనికికి ప్రమాదం పొంచి ఉందంటూ గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు మరో పిల్ వేశారు. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన హైకోర్టు.. సీఆర్‌జడ్ పరిధి నిర్ణయించి, అక్రమ నిర్మాణాలు ఉంటే కూల్చివేయాలని ఆదేశించింది.




## హ్యాట్రిక్ సున్నాలు.. ఢిల్లీ ఎన్నికల్లో 'చేయి' తిరగకపోవడానికి కారణాలివే!

ఎగ్జిట్‌పోల్స్ నిజమయ్యాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా జయకేతనం ఎగరవేసింది. అధికార ఆమ్ ఆద్మీ పార్టీ అధికారం కోల్పోయింది. కాంగ్రెస్ పార్టీ ముచ్చటగా మూడోసారి ఓటమిపాలైంది. ఒకప్పుడు హ్యాట్రిక్ విజయాలతో ఢిల్లీ రాష్ట్ర పీఠంపై కూర్చొన్న హస్తం.. ఇప్పుడు కనీసం ఆ చేతిని ఎత్తే పరిస్థితిలో కూడా లేకపోవడం గమనార్హం. ఢిల్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ ఓటములతో ఆ పార్టీ ఉనికే ప్రశ్నార్థకంగా మారింది.

**ఇక అదంతా గతవైభవం..! :** ఢిల్లీ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత తొలిసారి భాజపా విజయం సాధించగా, 1998లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మొదటిసారి అధికారాన్ని కైవసం చేసుకుంది. అప్పటి నుంచి జరిగిన వరుసగా ప్రతి ఎన్నికల్లోనూ ఆ పార్టీ విజయం సాధిస్తూ వచ్చింది. ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ నాయకత్వంలో హస్తం పార్టీ హస్తినలో తిరుగులేని శక్తి మారింది. 2003, 2008 ఎన్నికల్లోనూ గెలిచి హ్యాట్రిక్ విజయాలను నమోదు చేసింది. ఆ సమయంలో కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం ఉండటం ఢిల్లీ రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ చక్రం తిప్పడం సులువైంది.

**కాంగ్రెస్‌కు మొదలైన కష్టాలు..** ఢిల్లీలోనే కాదు, దేశ రాజకీయాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఒక సంచలనం. అధికార వ్యవస్థలో వేళ్లూనుకుపోయిన అవినీతి, లంచగొండితనాన్ని భరించలేకపోయిన ఢిల్లీ ప్రజలకు ఆప్ ఒక ఆశాకిరణంగా కనిపించింది. 2013 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఉన్న ఓటు బ్యాంకు చాలా వరకూ ఆప్‌నకు మళ్లింది. దీంతో ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ 8 స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇక 2015 ఎన్నికల్లో ఎన్నికల్లో ఉన్న ఆ సీట్లు కూడా కోల్పోయి రిక్త 'హస్తా'లతో మిగిలింది. 2015, 2020 ఎన్నికల్లోనూ ఓటర్లు కాంగ్రెస్ చేతిలో ఏమీ పెట్టలేదు సరికదా.. ఉన్న ఓటు బ్యాంకు కూడా తరిగిపోయింది. కేంద్రంలో ప్రధాని మోదీ నాయకత్వాన వివిధ రాష్ట్రాల్లో భాజపా బలమైన పునాదులు వేసుకుంటూ వెళ్తుంటే, కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఉండిపోయింది తప్ప, తన పార్టీని, కేడర్‌ను బలపేతం చేసే దిశగా ఆలోచించలేకపోయింది. ముఖ్యంగా భాజపా యువ రక్తాన్ని పార్టీకి ఎక్కిస్తుంటే, కాంగ్రెస్‌లో ఆ జోష్ కనిపించలేదు. ప్రతిఫలమే వివిధ రాష్ట్రాల్లోనూ అధికారాన్ని కోల్పోవడం.

**కాంగ్రెస్ ఓటు బ్యాంకు బదిలీ..** 'చాప కింద నీరులా' ఉత్తరాదిలో వివిధ రాష్ట్రాల్లో ఆప్ నెమ్మదిగా విస్తరిస్తూ వెళ్లింది. ఒకప్పుడు భాజపాకు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ పార్టీ కనిపించేది. ఆ తర్వాత ఆప్ కనిపిస్తుండటంతో కాంగ్రెస్ ఓటు బ్యాంకు ఇటు బదిలీ అవడం మొదలైంది. దీంతో ఢిల్లీ సహా సరిహద్దు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రాభవం మసకబారడం మొదలు పెట్టింది. ప్రతి రాజకీయ పార్టీకి బలమైన ఓటు బ్యాంకు ఉంటుంది. అలా జనసంఘ్ నుంచి భాజపాకు స్థిరమైన ఓటు బ్యాంకు ఉంది. అలాగే, ఆర్థిక, సామాజిక కోణాల్లో ఆ పార్టీపై అభిమానంతో ఓటు వేసే వాళ్లూ ఉన్నారు. దీంతో కాంగ్రెస్ వ్యతిరేక ఓటర్లు, భాజపా విధానాలు నచ్చని వారు ఆప్ వైపు మళ్లారు. ఆ విధంగా కాంగ్రెస్ ఓటు షేర్ దారుణంగా పడిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో భాజపాను విమర్శిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌కు ఓట్లు పడవన్న సంగతి కాంగ్రెస్ అధినాయకత్వం గుర్తించింది. పైగా అది మరింత వ్యతిరేకతను తెచ్చి పెట్టే అవకాశమూ ఉంది. అందుకే ఇటీవల ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ రాహుల్‌గాంధీ తన ప్రచారంలో ఆప్‌పై విమర్శలు గుప్పించడం గమనార్హం.

**నాయకత్వ లేమి..** రాజులేని రాజ్యం ఎంతోకాలం మనుగడ సాగించలేదు. సుదీర్ఘ చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీని ప్రధానంగా వేధిస్తున్న సమస్య బలమైన నాయకత్వం లేకపోవడం. దేశ రాజధానిలో షీలా దీక్షిత్ నాయకత్వంలో కాంగ్రెస్‌పార్టీ 15 ఏళ్ల పాటు పాలన చేసింది. ఆమె తర్వాత రాష్ట్రంలో పార్టీని నడిపించే సరైన నాయకుడు లేకుండా పోయాడు. వ్యవస్థాగతంగానూ రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయలేకపోయారు. భాజపా, ఆప్‌ను ఢీకొట్టే నాయకులను కాంగ్రెస్ పార్టీ తయారు చేయలేకపోయింది. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం చేయకపోగా, కేంద్రంలో భాజపాను ఎండగట్టడానికి ఆప్‌తో చేతులు కలిపి, రాష్ట్రంలో మాత్రం ఆప్‌ను తిడుతూ కాంగ్రెస్ వ్యవహరించిన ద్వంద్వనీతిని ఓటర్లు హర్షించలేకపోయారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లోనూ షీలా దీక్షిత్ కాలంలో జరిగిన అభివృద్ధినే ఇప్పటికీ చెప్పుకొంటూ కాంగ్రెస్ ఓట్లు అడగడం చూస్తే, 'చెట్టు పేరు చెప్పి ఇంకెంత కాలం కాయలు అమ్ముతార'ని రాజకీయ విశ్లేషకులు సైతం పెదవి విరుస్తున్నారు.

**గెలిస్తే ఏం చేస్తామో చెప్పే స్పష్టత లేకపోవడం :** పార్టీలో నాయకత్వలేమి, సంస్థాగత సమస్యలు ఎన్ని ఉన్నా, ఎన్నికల్లో గెలిస్తే, ప్రజలకు ఏం చేస్తామో, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు ఏం మేలు జరుగుతుందో స్పష్టంగా చెప్పడం కూడా ఒక కళ. షీలా దీక్షిత్ హయాంలో జరిగిన అభివృద్ధిని ఇప్పటికీ ఓటర్లు గుర్తు పెట్టుకుంటారని కాంగ్రెస్ పార్టీ భావించడం నిజంగా వెర్రితనమే. పైగా, దాదాపు పదేళ్ల ఆప్ పాలన, రాజకీయ, ఆర్థిక, సామాజిక మార్పుల కారణంగా నాటి ఫలాలను గుర్తు పెట్టుకోవడం సగటు ఓటరుకు కష్టమే. 'ఇప్పుడున్న ప్రభుత్వం ఏం చేస్తోంది.. రాబోయే ప్రభుత్వం ఏం చేస్తుంది' అన్నది మాత్రమే ఓటరు చూస్తాడు. మహిళలకు రూ.2500, 25 లక్షల ఆరోగ్యబీమా ఇస్తామని తాజా మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించినా ఓటర్లు పెద్దగా పట్టించుకోలేదు. ఇది ఇలాగే కొనసాగితే, భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీ చెల్లించుకునే మూల్యం దేశంలో ఆ పార్టీ ఉనికినే ప్రశ్నార్థంగా మారుస్తుందని రాజకీయ పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.




## అవినీతి పాలనకు ఢిల్లీ ప్రజలు చరమగీతం పాడారు: కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

అవినీతి, కుంభకోణాలు, వారసత్వ, జైలు పార్టీలకు ఢిల్లీ ప్రజలు చరమగీతం పాడారని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కమలం జెండా ఎగరేయడమే లక్ష్యంగా పనిచేసి న అందరినీ 'ఎక్స్' వేదికగా ఆయన అభినందించారు. లక్ష్య సాధనలో అఖండ విజయం సాధించిన విజేతలకు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు.

**ఢిల్లీలో భాజపా గెలుపు ప్రజా విజయం: పురందేశ్వరి...** ఢిల్లీలో భారతీయ జనతా పార్టీ ఘన విజయం ప్రజలకే చెందుతుందని ఆ పార్టీ ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరి అన్నారు. ప్రజలంతా నిబద్ధతతో శ్రమించి భాజపాను గెలిపించారని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. సుపరిపాలన, మౌలిక వసతుల కల్పన, కాలుష్య రహిత యమునను ప్రజలంతా ఆశించారని, పేదలకు ఇళ్లు, శుభ్రమైన తాగునీటి వసతులను కోరుకున్నారని అన్నారు. కులమతాలు, వర్గాలకు అతీతంగా ప్రజలంతా భాజపాపై తిరుగులేని విశ్వాసం ఉంచారని తెలిపారు. ఢిల్లీ ప్రజలు, భాజపా కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు

## ఢిల్లీ పీఠం కైవసం.. ఏపీ భాజపా కార్యాలయంలో సంబరాలు



అమరావతి: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా ఘన విజయం సాధించడంతో ఏపీలోని పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీ పీఠం కైవసం చేసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు.

'ఢిల్లీ గడ్డ భాజపా అడ్డా' అంటూ నినాదాలు చేశారు. విజయవాడలోని భాజపా కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాజీ, పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ సహా పలువురు నేతలు పాల్గొన్నారు.

సామాన్యుల పార్టీగా ప్రారంభమై.. అవినీతి ఊబిలో కూరుకుపోయిన ఆప్ పార్టీకి అన్ని వర్గాల ఓటర్లు గుణపాఠం చెప్పారని అన్నారు.

## ఏపీ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం



అమరావతి: మహానాడు రోడ్డు పేరును యధాతథంగా ఉంచాలంటూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో దేవినేని అవినాష్ ప్రోద్బలంతో మహానాడు రోడ్డు పేరును దేవినేని రాజశేఖర్ రెడ్డి పేరుగా మార్చారు. మహానాడు పేరు కొనసాగించాలంటూ స్థానికుల నుంచి పెద్దఎత్తులో విజ్ఞప్తులు ప్రభుత్వానికి వచ్చాయి. స్థానికుల విజ్ఞప్తితో పాటు రోడ్డు చరిత్రను వివరిస్తూ మున్సిపల్ కమిషనర్‌కు విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు లేఖ రాశారు. ఈ లేఖపై స్పందించి రికార్డును పరిశీలించి, సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి మున్సిపల్ కమిషనర్ నివేదించారు. కౌన్సిల్ తీర్మానం వివాదాస్పదంగా ఉండటంతో ఆ తీర్మానాన్ని రద్దు చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## మోడ్రన్ అప్సరసలా రెజీనా మెరుపులు


సౌత్ లో గ్లామరస్ హీరోయిన్ గా తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ సొంతం చేసుకున్న అందాల భామ రెజీనా కసాండ్ర. ఈ అమ్మడు 2005లో నటిగా కెరియర్ స్టార్ట్ చేసింది. అయితే 2010లో శివ మనసులో శృతి సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. నెక్స్ట్ సందీప్ కిషన్ కి జోడీగా రొటీన్ లవ్ స్టోరీ అనే మూవీలో చేసింది. ఈ సినిమాలు ఆశించిన స్థాయిలో మెప్పించలేదు. అయితే రవితేజకి జోడీగా చేసిన 'పవర్', సాయి ధరమ్ తేజ్ మొదటి సినిమా 'పిల్లా నువ్వు లేని జీవితం' రెజీనాకి కమర్షియల్ బ్రేక్ ఇచ్చాయి. ఈ సినిమాల తర్వాత అమ్మడు వెనక్కి తిరిగి చూసుకోలేదు. వరుసగా తెలుగులో అవకాశాలు అందుకుంది. అలాగే మాతృభాష తమిళంలో కూడా మంచి ఛాన్స్ లు అందుకుంది. ఆమె చివరిగా తెలుగులో



'ఎవరు' అనే మూవీతో సూపర్ హిట్ అందుకుంది. ఆ తరువాత చెప్పుకోదగ్గ మూవీస్ పడలేదు. తమిళంలో కూడా వరుసగా సినిమాలు చేస్తోన్న స్టార్ హీరోలతో జోడీ కట్టే అవకాశాలు మాత్రం రావడం లేదు. రీసెంట్ గా తెలుగులో 'ఉత్సవం' అనే మూవీతో రెజీనా ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ మూవీ పెద్దగా మెప్పించలేదు. అజిత్ 'విడాముయార్చి' సినిమాలో రెజీనా కీలక పాత్రలో నటించింది. హిందీలో గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాబీ డియోల్ హీరోగా తెరకెక్కుతోన్న 'జాట్' మూవీలో నటించింది. అలాగే 'సెక్షన్ 108', 'ఫ్లాష్ బ్యాక్' అనే హిందీ సినిమాలు పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్నాయి. ఇలా ఈ బ్యూటీ చేతిలో నాలుగు సినిమాలున్నాయి. ఇదిలా ఉంటే ఈ రోజు రెజీనా కసాండ్రా బర్త్ డే సందర్భగా సోషల్ మీడియాలో చాలా మంది ఆమెకి విషెస్ చెబుతున్నారు. IIFA ఉత్సవం ఇన్ స్టాగ్రామ్ పేజీలో రెజీనా గ్లామరస్ ఫోటోని షేర్ చేసి బర్త్ డే విషెస్ చెప్పారు. ఈ ఫోటోలో అమ్మడు చాలా కలర్ ఫుల్ గా ఉంది. వైట్ కలర్ లాంగ్ ఫ్రాక్ లో అదిరిపోయే అందంతో కట్టిపడేస్తోంది. చూడగానే మోడ్రన్ అప్సరసలా రెజీనా ఉందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. హీరోయిన్ గా ఛాన్స్ లు తగ్గిన రెజీనా తన టాలెంట్ తో విభిన్న క్యారెక్టర్స్ చేస్తూ దూసుకుపోతోంది. గ్లామర్ రోల్స్ కి కూడా రెజీనా పెర్ఫెక్ట్ ఛాయస్ అని ఈ ఫోటోలు చూస్తుంటే అనిపిస్తోంది.

## డైరెక్టర్ కి హ్యాండ్ ఇచ్చిన బోల్డ్ బ్యూటీ!

'ఆషీకీ' ఫ్రాంచైజీ నుంచి థర్డ్ ఇన్ స్టాల్ మెంట్ రెడీ అవుతోన్న సంగతి తెలిసిందే. యంగ్ హీరో కార్తీక్ ఆర్యన్ నటిస్తుండగా అనురాగ్ బసు తెరకెక్కిస్తున్నారు. ఈ ఫ్రాంచైజీలో హీరోయిన్ అత్యంత కీలకమైన నేపథ్యంలో ఆ పాత్ర కోసం స్టార్ హీరోయిన్లు దీపికా పదుకొణే..కత్రినా కైప్ లాంటి భామల్ని పరిశీలించారు. కానీ చివరి నిమిషంలో వాళ్లకంటే కొత్త నటి అయితే బాగుటుందని యువ నటి ఆకాంక్ష శర్మని అనుకుని చివరిగా ఆ ఛాన్స్ త్రిప్తీ డిమ్రీకి ఇచ్చారు. ఆకాంక్ష కంటే త్రిప్తి అయితే కార్తీక్ కి పర్ఫెక్ట్ జోడీగా సెట్ అవుతుందని అనురాగ్ పిలిచి మరీ ఛాన్స్ ఇచ్చాడు. త్రిప్తీ కూడా ఒకే చెప్పింది. అయితే ఇప్పుడీ ప్రాజెక్ట్ నుంచి త్రిప్తీ డిమ్రీ ఎగ్జిట్ అయింది. పిలిచి మరీ అవకాశం ఇస్తే ఎగ్జిట్ అవ్వడంతో అనురాగ్ కాస్త అసంతృప్తిగానే ఉన్నాడు. ఎందుకు తప్పుకుందో తనకే తెలియాలనేసాడు. దీంతో డేట్లు సర్దుబాటు కాకపోవడంతోనే ప్రాజెక్ట్ వదులుకున్నట్లు చిత్ర వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం త్రీప్తీ డిమ్రీ బాలీవుడ్ లో %–%ధడక్



2%–% లో నటిస్తోంది. దీంతో పాటు మరో చిత్రానికి కూడా అగ్రిమెంట్ చేసుకుంది. అయితే ఈ రెండు సినిమాలకు ఏక కాలంలో షూటింగ్ కి హాజరవుతుంది. ఇదే సమయంలో %–%ఆషీకీ –2%–% షూట్ కూడా ప్లాన్ చేస్తున్నారుట. దీంతో ఒకే సమయంలో మూడు సినిమా షూటింగ్ లకు హాజరు కావడం సాధ్యం కకాపోవడంతోనే అమ్మడు ఎగ్జిట్ అయినట్లు తెలుస్తోంది. మూడేళ్ల క్రితం అవకాశం ఎప్పుడొస్తుందా? అని ఎదురు చూసే బ్యూటీ ఇప్పుడు ఆషీకీ లాంటి గొప్ప చిత్రంలో నటించే ఛాన్స్ వచ్చినా? వదులుకుందంటూ నెటి జనులు పోస్టులు పెడుతున్నారు. ఈ ప్రాజెక్ట్ విషయంలో అనురాగ్ త్రీప్తిని ఏరికోరి మరీ తీసుకున్నాడు. ఎంపిక చేసిన తర్వాత త్రిప్తీ డిమ్రీని తొలగించారనే ప్రచారం పెద్ద ఎత్తున జరిగింది. వాటిని మీడియా ముందుకొచ్చి మరీ అనురాగ్ ఖండిచాడు. ఆమెపై జరిగిన నెగిటివ్ ప్రచారాన్ని ఖండించి మద్దతుగా నిలిచాడు. కానీ చివరికి ఆయనకే హ్యాండ్ ఇచ్చిందీ బ్యూటీ.




## అనుష్క ఘాటి.. ఫైనల్ గా వచ్చే డేట్ చెప్పేసారు




స్టార్ హీరోయిన్ అనుష్క.. చిన్న గ్యాప్ తర్వాత ఘాటి మూవీతో అలరించేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. పవర్ ఫుల్ రోల్ లో ఆమె నటిస్తున్న ఘాటి.. పాన్ ఇండియా లెవెల్ లో తెరకెక్కుతోంది. సర్వైకల్ థ్రిల్లర్ గా రూపొందుతున్న ఆ మూవీకి క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్నారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఘాటి మూవీపై ఆడియన్స్ లో వేరే అంచనాలు ఉన్నాయి. రీసెంట్ గా మేకర్స్ రిలీజ్ చేసిన వీడియో గ్లింప్స్ తో అంచనాలు మరింతగా పెరిగిపోయాయి. అనుష్క రోల్ మాస్ షేడ్స్ తో ఉండబోతున్నట్లు గ్లింప్స్ ద్వారా అందరికీ క్లారిటీ వచ్చేసింది. సరికొత్త స్టోరీతో మూవీ ఉండబోతున్నట్లు అర్థమైపోయింది. దీంతో సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందోనని అంతా ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా.. మేకర్స్ తాజాగా క్రేజీ అప్డేట్ ఇచ్చారు. మూవీ రిలీజ్ డేట్ ను ప్రకటించారు. వచ్చే ఏడాది వేసవి కానుకగా ఏప్రిల్ 18వ తేదీన ఘాటిని రిలీజ్ చేయబోతున్నట్లు ఆదివారం తెలిపారు. ఓ స్పెషల్ పోస్టర్ తో పాటు వీడియోను షేర్ చేశారు. పోస్టర్ లో నెత్తుటి మరకలతో అనుష్క కనిపిస్తూ.. సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నారు. చేతిలో తుపాకీతో కొండపై భీకరమైన లుక్ లో ఉన్నారు. వీడియోలో డైరెక్టర్ క్రిష్ తోపాటు టీమ్ అంతా మూవీ వర్క్ ఎంతవరకు వచ్చిందోనని డిస్కస్ చేసుకుంటూ ఉంటారు. ఇంతలో అనుష్క వచ్చి.. క్యూట్ క్యూట్ గా రిలీజ్ డేట్ ను రివీల్ చేస్తారు. అయితే సరైన విడుదల తేదీని ఘాటి మేకర్స్ సెలెక్ట్ చేసుకున్నారనే చెప్పాలి. అప్పుడే అందరికీ హాలీడేస్ స్టార్ట్ అవుతాయి. మౌత్ టాక్ పాజిటివ్ గా ఉంటే సినిమాకు తిరుగుండదు. మేకర్స్ కూడా అంతే రీతిలో ప్రమోట్ చేయాలి. ఇక సినిమా విషయానికొస్తే.. మనోజ్ రెడ్డి కటసాని సినిమాటోగ్రాఫర్ గా, నాగవెల్లి విద్యా సాగర్ మ్యూజిక్ డైరెక్టర్ గా, తోట తరణి ఆర్ట్ డైరెక్టర్ గా వ్యవహరిస్తున్నారు. చాణక్య రెడ్డి తూరుపు, వెంకట్ ఎన్ స్వామి ఎడిటర్లుగా పనిచేస్తుండగా, సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ అందిస్తున్నారు. మరి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానున్న ఘాటి మూవీ ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.


## గుసగుస.. నటవారసులకు జీరో బజ్



అగ్ర హీరో లేదా అగ్ర హీరోయిన్ కుటుంబం నుంచి నటవారసులు తెరుకు పరిచయం అవుతున్నారు! అంటే.. దానికి ఎంతో క్రేజ్ ఉంటుంది. మహేష్, చరణ్, ప్రభాస్, ఎన్టీఆర్ వంటి నటవారసులు బరిలో దిగినప్పుడు ఫ్యాన్స్ లో హంగామా ఎలా ఉందో చూసాం. కొంతమంది నటవారసురాళ్లు తెరకు పరిచయమైనా అభిమానులు ఆసక్తిని కనబరిచారు. కానీ ఇప్పుడు ఏమైందో కానీ.. అమీర్ ఖాన్ అంతటి పెద్ద స్టార్ కుమారుడు జునైద్ ఖాన్ నటించిన సినిమాకి .. శ్రీదేవి నటవారసురాలు ఖుషీ కపూర్ నటించిన సినిమాకి ఆశించినంత బజ్ లేకపోవడం ఆశ్చర్యపరుస్తోంది. ఎక్కడ తేడా కొట్టిందో కానీ బుక్ మై షో సహా ఆన్ లైన్ టికెటింగ్ లో అస్సలు ఏమాత్రం హైప్ లేదు. పోటీ బరిలో పెద్ద సూపర్ స్టార్ల సినిమాలు కూడా ఏం లేవు. అయినా జునైద్ – ఖుషి కపూర్ జంటగా నటించిన లవ్ యాపా చిత్రానికి టికెట్ సేల్ ఆశించిన విధంగా లేకపోవడం నిరాశపరుస్తోంది. మరోవైపు హిమేష్ రేషమ్మియా నటించిన రెట్రో సినిమా– బాడ్ యాస్ రవికుమార్ కి అద్భుతమైన టికెట్ సేల్ కనిపిస్తోంది. రేషమ్మియాకు ఉన్న ఫాలోయింగ్ దృష్ట్యా అతడి కోసం జనం థియేటర్లకు తరలి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. అయితే మిస్టర్ పర్ఫెక్ట్ అమీర్ ఖాన్ కుటుంబం నుంచి హీరో వస్తున్నాడు! అంటే అంతగా బజ్ లేకపోవడం నిజంగా ఆశ్చర్యపరుస్తోంది. లవ్ యాపా టీజర్లు, ట్రైలర్లు , పోస్టర్లు, పాటలతో హంగామా సృష్టించాలని ప్రయత్నించినా, అమీర్ ఖాన్ స్వయంగా బరిలో దిగి కేవ్ మేన్ అవతారం ఎత్తి వీధుల్లో తిరుగుతూ ప్రచారం నిర్వహించినా కానీ లవ్ యాపాకు ఆన్ లైన్ టికెట్ సేల్ ఆశించినంతగా లేదు. లవ్ యాపా ఫిబ్రవరి 7న విడుదలవుతోంది. పరిమిత థియేటర్లలో విడుదల చేస్తున్నా ఈ సినిమాని చూసేందుకు జనం కదిలి రావడం లేదు. దీనికి అద్వైత్ చందన్ దర్శకత్వం వహించాడు. లవ్ యాపా రిలీజైన కొన్ని రోజుల తర్వాత మొన్నటి మార్కో తరహాలో లేటుగా అయినా పుంజుకుంటుందేమో! చూడాలి. తమిళ బ్లాక్ బస్టర్ లవ్ టుడే కి రీమేక్ గా రూపొందించిన లవ్ యాపా డెబ్యూ స్టార్లను ఆదుకుంటుందా లేదా వేచి చూడాల్సిందే.

## యాంకర్ స్రవంతి.. వైట్ షర్ట్ లో గ్లామర్ బ్లాస్ట్..

యాంకర్ స్రవంతి చొక్కారపు గురించి అందరికీ తెలిసిందే. కొన్ని నెలలుగా ఇండస్ట్రీ వర్గాల్లో ఆమె పేరు గట్టిగానే వినిపిస్తోంది. స్టార్ హీరోల సినిమాల ఈవెంట్స్ లో హోస్ట్ గా ఎక్కువగా అమ్మడే కనిపిస్తున్నారు. అనేక టీవీ షోలు, సినీ ప్రముఖులతో ఇంటర్వ్యూలు, వివిధ మూవీ ఫంక్షన్స్ తో బిజీగా బిజీగా గడుపుతున్నారు ముద్దుగుమ్మ. ఇక సోషల్ మీడియాలో స్రవంతికి క్రేజ్ వేరే లెవెల్ లో ఉంది. స్టార్ట్ హీరోయిన్స్ ను మించిన అందంతో సందడి చేస్తుంటారు. ఎప్పటికప్పుడు కొత్త కొత్త పిక్స్ ను పోస్ట్ చేస్తుంటారు. ఫుల్ యాక్టివ్ గా ఉంటూ సందడి చేస్తుంటారు. ఫాలోవర్స్ ను ఎప్పుడూ



డిస్సాపాయింట్ చేయరు. అటు మోడ్రన్ గా.. ఇటు ట్రెడిషనల్ గా కనిపిస్తూ మెప్పిస్తుంటారు. గ్లామరస్ గా కనిపిస్తూ నెట్టింట హీట్ పుట్టిస్తుంటారు. తన పిక్స్ తో సెగలు రేపుతుంటారు. అలా ఎప్పుడూ ట్రెండింగ్ లోనే ఉంటారు. తాజాగా కొత్త ఫోటోస్ ను షేర్ చేశారు. జీన్ అండ్ షర్ట్ లో అందాలు ఆరబోశారు. టోర్న్ జీన్ వేసుకున్న అమ్మడు.. వైట్ కలర్ షర్ట్ తో గ్లామర్ షో చేశారు.

ఆ షర్ట్ పై ఉన్న లిప్స్ సింబల్స్ తో అట్రాక్ట్ చేస్తున్నారు. క్రేజీగా జడ వేసుకున్న స్రవంతి.. తన లుక్స్ తో ఫిదా చేశారు. తన అందాలతో మైండ్ బ్లాక్ చేశారు. రకరకాల పోజులతో ఫ్లాట్ చేశారు. అందరి దృష్టిని తనవైపు తిప్పుకున్నారు. ప్రస్తుతం ఆమె పిక్స్ ఫుల్ వైరల్ గా మారాయి. మేడమ్ సర్ మేడమ్ అంతే అని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. పిక్స్ సూపర్ అని చెబుతున్నారు.

## త్రోబ్యాక్: దిండు చైతన్యకు మొదటి భార్య

అక్కినేని నాగచైతన్య– సమంత రూత్ ప్రభు జంట ప్రేమ పెళ్లి బ్రేకప్ అవ్వడం అభిమానులను షాక్ కి గురి చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఎవరి దారిలో వారు స్వేచ్ఛగా ఉన్నారు. నాగచైతన్య ఇటీవలే తెలుగమ్మాయి శోభిత ధూళిపాలను పెళ్లాడారు. అతడు పూర్తిగా కొత్త జీవితాన్ని ఆస్వాధిస్తున్నాడు. సమంత ప్రస్తుతం కెరీర్ పరమైన బిజీలో ఉన్నారు. ఇంతలోనే సామ్ పాత ఇంటర్వ్యూ నుంచి ఒక క్లిప్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. ఈ వీడియోలో సమంత చేసిన వ్యాఖ్యలు మరోసారి హాలి టాపిగ్గా మారాయి. చై బెడ్ పై దిండును తన మొదటి భార్యగా భావించే అలవాటు గురించి సమంత ఫిర్యాదు చేసింది. 2019లో ఫీట్ అప్ విత్ ది స్టార్స్ (తెలుగు) కార్యక్రమంలో సమంత మాట్లాడుతూ.. చైతన్యతో తన బంధం ఎలా



ఉందో వెల్లడించింది. వివాహం తర్వాత వారి రిలేషన్‌లో ఏమి మారిందని హోస్ట్ ప్రశ్నించగా, చాలా సరదాగా మాట్లాడేసిన సమంత.. దిండు చైతన్యకు మొదటి భార్య. నేను ముద్దు పెట్టుకోవాల్సి వచ్చినా దిండు ఎప్పుడూ మా మధ్యనే ఉంటుంది. ఇప్పటికి ఇది చాలు. నేను చాలా విషయాలు చెప్పేశాను%––% అంటూ వ్యాఖ్యానించింది. కారణం ఏదైనా కానీ చై– సామ్ జంట విడిపోవడం అభిమానులను ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ బ్రేకప్ పై చాలా ఊహాజనిత కథనాలు వెలువడ్డాయి. సమంత బోల్డ్ ఇమేజ్ గురించి అక్కినేని కుటుంబంలో అనుమతించలేదని, దానిని సమంత వ్యతిరేకించిందని కథనాలొచ్చాయి. నాగ చైతన్య –శోభితా ధూళిపాళ 4 డిసెంబర్ 2024న హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోస్‌లో సాంప్రదాయ వేడుకలో వివాహం చేసుకున్నారు. ఈ వేడుక కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల నడుమ అందంగా సాగింది. ఇక బ్రేకప్ తర్వాత సమంత మయోసైటిస్ అనే ఆటో ఇమ్యూన్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొన్నా చివరికి దాని నుంచి కోలుకుంటోంది.



## మాకు రావాల్సిన నిధులు ఇప్పించండి..కేంద్ర ఆర్థిక మంత్రికి భట్టి విజ్ఞప్తి

విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులు ఇంకా పెండింగ్ లో ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ను కోరారు. శనివారం ఢిల్లీలో సఫ్దర్ జంగ్ రోడ్డులోని నిర్మలాసీతారామన్ నివాసంలో ఆమెను కాంగ్రెస్ ఎంపీలు, అధికారులతో పాటు భట్టి విక్రమార్క కలిశారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి వివిధ అంశాల్లో రావలసిన ఆర్థిక వనరులకు సంబంధించి విజ్ఞప్తి చేశారు. గతంలో ఈ అంశాలకు సంబంధించి రాసిన లేఖలను సైతం మంత్రికి అందజేశారు. వివిధ కార్పొరేషన్‌లు/ ఎస్ పీవీల ఋణ పునర్వ్యవస్థీకరణ విషయంలో ఆర్థిక సంస్థలకు మార్గదర్శకాలు జారీ చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ. 4,08,48,54,461 తిరిగి చెల్లింపును వేగవంతం చేయాలని, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 కింద, విభాగం 94(2) ప్రకారం, తెలంగాణకు రావలసిన వెనుకబాటుగా ఉన్న జిల్లాల కోసం ప్రత్యేక సహాయ నిధి విడుదల చేయాలని కోరారు. 2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్రంగా ప్రయోజిత పథకాల నిధుల విడుదలలో జరిగిన కేటాయింపు పొరపాటు సరిచేయాలని విజ్ఞప్తి చేశారు. విభజన చట్టంలో పేర్కొన్న మేరకు రూ. 208.24 కోట్లు తిరిగి చెల్లించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి తెలంగాణ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు కేటాయించిన అదనపు బాధ్యత మేరకు అందుకోవలసిన మొత్తానికి సంబంధించిన అంశం పైన ఈ సందర్భంగా చర్చించారు. ఇరు రాష్ట్రాల పవర్ యుటిలిటీల మధ్య పెండింగ్‌లో ఉన్న బకాయిల పరిష్కారం చేయాలని కోరారు. ఈ డిప్యూటీ సీఎం వెంట ఎంపీలు మల్లు రవి,చామల కిరణ్ కుమార్ రెడ్డి, బలరాం నాయక్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, తదితరులు ఉన్నారు.




హైదరాబాద్: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో భాజపా భారీ విజయం దిశగా దూసుకెళ్తోంది. ఈ ఫలితాలపై కేంద్ర మంత్రి, భాజపా తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి స్పందించారు.

27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో భాజపా అధికారంలోకి వస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. అక్కడ డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పడబోతుందని పేర్కొన్నారు. "ఢిల్లీ ఓటర్లకు శుభాకాంక్షలు. అద్భుతమైన విజయాన్ని ఢిల్లీ ప్రజలు ఇచ్చారు. దక్షిణ భారతదేశంలో భాజపాకు మంచి వాతావరణం ఉంది. కర్ణాటక, తెలంగాణలోనూ మా పార్టీ అధికారంలోకి వస్తుంది. భారాస తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోంది.


ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అన్ని వర్గాలను మోసం చేసింది. కాంగ్రెస్ పార్టీ బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతోంది. బీసీలను అవమానిస్తూ.. అన్యాయం చేస్తున్నారు. బీసీల్లో కాంగ్రెస్ పార్టీపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది" అని కిషన్ రెడ్డి అన్నారు.

## ఢిల్లీ ఎన్నికలు.. మేధావి వర్గం ఓట్లు భాజపాకే: బండి సంజయ్



హైదరాబాద్: ఢిల్లీ ఎన్నికల ఫలితాల్లో భాజపా దూసుకెళుతుండటంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు. ఢిల్లీ ప్రజలు చీపురుతో ఆమ్ ఆద్మీ పార్టీని ఊడ్చేశారన్నారు. "ప్రజాస్వామ్య బద్ధమైన పాలనను ఢిల్లీ ప్రజలు కోరుకున్నారు. అవినీతి, కుంభకోణాలు, జైలు పార్టీలు వద్దు అనుకున్నారు. ఢిల్లీలో కాషాయ జెండా ఎగురుతుందని ముందు నుంచి ఊహించిందే. మేధావి వర్గం అంతా మా పార్టీకే ఓటు వేశారు. తెలంగాణలో కూడా అధికారంలోకి వస్తాం. రాష్ట్రంలో జరుగుతున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో భాజపా విజయం సాధిస్తుంది. రాష్ట్రంలోని మేధావి, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు ఆలోచించి ఓటు వేయాలి. శాసనసభలో మీ సమస్యలపై ప్రశ్నించేది భాజపా ఒక్కటే" అని బండి సంజయ్ అన్నారు.

## కంగ్రాట్స్ రాహుల్.. మరోసారి భాజపాను గెలిపించారు: కేటీఆర్ ఎద్దేవా



హైదరాబాద్: ఢిల్లీలో వెలువడుతున్న ఎన్నికల ఫలితాలపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. కాంగ్రెస్‌పై వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కంగ్రాట్స్ రాహుల్‌గాంధీ అంటూ ఎద్దేవా చేశారు. రాహుల్ మరోసారి భాజపాను గెలిపించారని పేర్కొన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ ఇప్పటి వరకు ఖాతా తెరవలేదు. ఇక్కడ భాజపా 43 స్థానాల్లో ఆధిక్యంలో దూసుకెళ్తుండగా.. ఆమ్ ఆద్మీ పార్టీ 27 స్థానాల్లో ముందంజలో ఉంది.

## స్థానిక ఎన్నికల నగరా.. స్పీడ్ పెంచిన ఎన్నికల సంఘం

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల కోసం తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం చేసింది. ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాకు పది మంది చొప్పున మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్ , స్టేట్ రిసోర్స్ పర్సన్‌లను ఎంపిక చేసింది.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ పంచాయతీ ఎన్నికల్లో పాల్గొనే అధికారులకు రాష్ట్ర ఎన్నికల సంఘం శిక్షణ ఇవ్వనుంది. ఇప్పటికే మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్, స్టేట్ రిసోర్స్ పర్సన్‌లకు ఎంసీహెచ్ఆర్డీలో ఎన్నికల సంఘం ట్రైనింగ్ ఇచ్చింది. జిల్లా కలెక్టర్లకు తెలంగాణ ఎలక్షన్ కమిషన్, కీలక ఆదేశాలు జారీ చేసింది. మండల, జిల్లా పరిషత్, పంచాయతీ రిటర్నింగ్ అధికారులను ఫిబ్రవరి 10వ తేదీ లోపు ఎంపిక పూర్తి చేయాలని ఆదేశించింది. పంచాయితీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల కోసం ఎంపిక చేసిన రిటర్నింగ్ అధికారులకు ఫిబ్రవరి 12లోపు శిక్షణ పూర్తి కావాలని తెలిపింది. పోలింగ్ ఆఫీసర్స్, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లకు ఈ నెల 15లోపు శిక్షణ పూర్తి చేయాలని సూచించింది. పోలింగ్ సిబ్బందికి మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్‌తో శిక్షణ పూర్తి చేయాలని తెలంగాణ ఎలక్షన్ కమిషన్ ఆదేశించింది.

## కాంగ్రెస్ ఘోర పరాజయంలో వారిద్దరి పాత్ర.. హరీష్‌రావు షాకింగ్ కామెంట్స్

హైదరాబాద్: ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందించారు. ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గాడిద గుడ్డు మిగిలిందని విమర్శించారు. మొన్న హర్యానా, నిన్న మహారాష్ట్ర, నేడు ఢిల్లీ ఘోర పరాజయంలో రాహుల్, రేవంత్ రెడ్డి పాత్ర అమోఘమని సెటైర్లు గుప్పించారు. ఇక్కడ హామీలు అమలు చేయకుండా, ఇతర రాష్ట్రాల్లో ప్రచారం చేసుకున్నంత మాత్రాన కాంగ్రెస్‌కు ఓట్లు పడతాయా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ గ్యారెంటీల నిజస్వరూపం దేశవ్యాప్తంగా బట్టబయలైందని ఆక్షేపించారు. ఢిల్లీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఆగమాగం చేసిన కులగణన ఆ పార్టీకి బెడిసికొట్టిందని విమర్శించారు. ఇప్పటికైనా తప్పులు ఒప్పుకొని, ప్రజలకు క్షమాపణ చెప్పి కులగణను మళ్లీ నిర్వహించాలని సూచించారు. అన్ని కులాలకు సమన్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేసిన తర్వాత అప్పుడు ఇతర రాష్ట్రాల్లో రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేసుకోవాలని హితవు పలికారు. లేదంటే రేవంత్ ఎక్కడ అడుగుపెట్టినా ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల్లోనూ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హరీష్‌రావు హెచ్చరించారు.




దిల్లీ: దేశ రాజధాని దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా ఘన విజయం సాధించింది. లోక్‌సభ ఎన్నికల్లో దిల్లీలోని ఏడుకు ఏడు సీట్లు వరుసగా మూడు సార్లు క్లీన్‌స్వీప్ చేసిన ఆ పార్టీ.. తాజాగా అసెంబ్లీ ఎన్నికల్లోనూ సత్తా చాటింది. తాజా విజయంతో తన పంతాన్ని నెగ్గించుకుంది. ఇక గతంలో దాదాపు 15 ఏళ్ల పాటు నిర్విరామంగా దిల్లీని ఏలిన కాంగ్రెస్ పార్టీ సున్నాకే పరిమితం అయ్యింది. ఈ ఎన్నికల ఫలితాలు భాజపా పట్టుదలను నిరూపించగా.. అదే సమయంలో ప్రతిపక్షాల ఐక్యతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్ కలసి పోటీ చేసి.. ఏడాది తిరగకముందే మళ్లీ విడివిడిగా పోటీ చేయడంతో ఇండియా కూటమి ఐక్యతపై మరోసారి నీలినీడలు కమ్ముకున్నాయి.

**మొదటి నుంచీ పిల్లీఎలుక వైరమే! :** అవినీతి వ్యతిరేక ఉద్యమం ద్వారా దిల్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ఆమ్ ఆద్మీ పార్టీకి, కాంగ్రెస్‌కు మధ్య మొదటి నుంచీ పిల్లి-ఎలుక వైరమే. 2013లో తొలిసారి ఆమ్ ఆద్మీ పార్టీ అధికారం చేపట్టింది కూడా కాంగ్రెస్ అధికారాన్ని కూలదోసే! ఆ ఎన్నికల్లో 28 సీట్లు గెలుపొందిన ఆమ్‌ఆద్మీ పార్టీ.. అదే కాంగ్రెస్ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం గమనార్హం. అయితే 49 రోజులకే ఆ ప్రభుత్వం కుప్పకూలింది.

మళ్లీ 2015 ఎన్నికల్లో ఏకంగా 67 సీట్లలో, 2020 ఎన్నికల్లో 62 సీట్లతో వరుస ఘన విజయాలు సాధించింది. ఆయా ఎన్నికల్లో భాజపా రెండో స్థానంలో నిలవగా.. కాంగ్రెస్ మూడో స్థానానికి పరిమితమైంది. ఒక్క దిల్లీలోనే కాదు పంజాబ్‌లోనూ కాంగ్రెస్‌ను కూలదోసి ఆప్ అధికారంలోకి వచ్చింది. అంటే రెండు చోట్లా కాంగ్రెస్ ప్రభుత్వాలకు గండి కొట్టింది ఆమ్ ఆద్మీనే.

**ఒక చోట కలసి.. ఇంకోచోట కలహం...** 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు భాజపా విజయాన్ని అడ్డుకోవడమే లక్ష్యంగా ఇండియా కూటమి ఏర్పడింది. ఆ ఎన్నికల్లో భాజపా వ్యతిరేక పార్టీలన్నీ జట్టుకట్టాయి. దిల్లీలో కాంగ్రెస్, ఆప్ కలిసి పోటీ చేశాయి. అయినా ఏడుకు ఏడు సీట్లూ భాజపా ఖాతాలోనే పడ్డాయి. పంజాబ్‌లో మాత్రం మళ్లీ వేర్వేరుగా పోటీ పడ్డాయి. అక్కడ ఈ రెండు పార్టీల మధ్యే ప్రధాన పోటీ నడిచింది. కాంగ్రెస్- 7, ఆప్-3 స్థానాలు గెలుచుకున్నాయి. మళ్లీ హరియాణాలో 10 స్థానాలకు గానూ రెండు పార్టీలు కలిసి పోటీ చేశాయి. ఇక్కడ భాజపా, ఇండియా కూటమి పార్టీలు ఐదేసి స్థానాలు గెలుపొందాయి. అక్కడికి కొన్ని రోజులకే జరిగిన హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారానికి దూరం చేసి భాజపా విజయం సాధించడం గమనార్హం. ఇండియా కూటమిలో ఆప్, కాంగ్రెస్ మాత్రమే కాదు.. ఇతర పార్టీలదీ అదే వైఖరి. కేరళలో కాంగ్రెస్, సీపీఎం నేతృత్వంలోని కూటముల మధ్యే పోటీ నడిచింది. పశ్చిమ బెంగాల్‌లో వచ్చేసరికి అవే రెండు పార్టీలు కలిసి పోటీ చేశాయి. ఇండియా కూటమిలో భాగమైన తృణమూల్ కాంగ్రెస్ వేరుగా పోటీ చేసింది. తాజాగా దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే సీన్ రిపీట్ అయ్యింది. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత ఓ దశలో ఇండియా కూటమిలో కాంగ్రెస్ ఉండకూడదన్న డిమాండ్‌ను సైతం ఆప్ తెరపైకి తీసుకొచ్చింది.

ఈ ఘటన ఈ రెండు పార్టీల మధ్య వైరాన్ని పెంచిందనే చెప్పాలి. కూటమిలోని పార్టీలైన సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్.. ఆమ్ ఆద్మీకి జైకొట్టాయి. కాంగ్రెస్‌ను ఒంటరిగా వదిలేశాయి.

**మళ్లీ కలిసుంటే..?...** దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల శాతాన్ని ఒకసారి గమనిస్తే.. భారతీయ జనతా పార్టీ దాదాపు 46 శాతం ఓటింగ్‌తో అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఆమ్ ఆద్మీకి 43 శాతం ఓటింగ్ వచ్చింది. కాంగ్రెస్‌కు సైతం 6 శాతం ఓట్లు పోలయ్యాయి. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో వీరిద్దరూ కలిసి పనిచేసి ఉంటే ఫలితం ఇంకోలా ఉండేదని విశ్లేషకులు అంటున్నారు. 'ఇంకా కొట్టుకుంటూ ఉండండి' అంటూ ఒమర్ అబ్దుల్లా వంటి ఇండియా కూటమి నేతలు అసహనం వ్యక్తంచేయడమూ విపక్షాల అనైక్యతకు అద్దం పడుతోంది. ఓ విధంగా ఇదే అనైక్యత భాజపాకు వరంగానూ మారుతోంది. అలాగని భాజపా సొంత బలాన్ని కొట్టిపారేయలేమని, పోరాట స్ఫూర్తిని తక్కువ చేయడానికి లేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.




## దిల్లీ ఎన్నికల ఫలితాలు.. కేజ్రీవాల్ సహా ఆప్ పెద్దల పరాజయం

దిల్లీ: దిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఆప్‌నకు భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్, అగ్రనేతలు మనీశ్ సిసోదియా, సత్యేందర్ జైన్ ఓడిపోయారు. ఫలితాల సరళిలో ఓటమి వైపు సాగుతోన్న పార్టీకి పెద్ద నేతల పరాజయం మరింత దెబ్బకొట్టింది. న్యూదిల్లీ అసెంబ్లీ స్థానంలో ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ 3వేల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఇక్కడ భాజపా అభ్యర్థి పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ విజయం సాధించారు. ఆప్ సీనియర్ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా జంగ్‌పురలో ఓటమిని చవిచూశారు. భాజపా అభ్యర్థి తర్వీందర్‌సింగ్ చేతిలో 600 ఓట్ల స్వల్ప తేడాతో పరాజయం పాలయ్యారు. షాకుర్ బస్తీలో సత్యేందర్ జైన్ ఓడిపోయారు. భాజపా అభ్యర్థి కర్నైల్ సింగ్ చేతిలో 19వేలకు పైగా ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. కాగా, దిల్లీ సీఎం ఆతిశీ కల్కాజీ స్థానం నుంచి విజయం సాధించారు. ఈమె తన సమీప భాజపా అభ్యర్థి రమేశ్ బిధూరిపై 900 ఓట్ల తేడాతో గెలుపొందారు. మొదటి నుంచి వెనుకంజలో ఉన్న ఆతిశీ.. అనుకోనివిధంగా చివరి రౌండ్‌లో పుంజుకొని గెలుపు వైపు దూసుకెళ్లారు.




దిల్లీ: దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపిన దిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నాయి. ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు అనుగుణంగానే ఫలితాల్లో భాజపా మ్యాజిక్ ఫిగర్‌ను దాటి దూసుకుపోతోంది. అధికార ఆమ్‌ఆద్మీ, కాంగ్రెస్ పార్టీలు వెనకంజలో ఉన్నాయి. దీనిపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందిస్తూ ఆప్, కాంగ్రెస్‌లకు చురకలు అంటించారు. దిల్లీలో బలం ఉన్న ఆప్‌కు కాంగ్రెస్ సహకరించలేదని, అందువల్లే ఎన్నికల ఫలితాల్లో వెనకబడిపోతున్నారని మండిపడ్డారు. ఇంకా మీలో మీరే కొట్టుకుంటూ ఉండండి అంటూ వారి తీరుపై అసహనం వ్యక్తంచేశారు.

**దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు.. పార్టీల ఆధిక్యాలు ఇలా...** దిల్లీ ఎన్నికల విషయంలో 'ఇండియా' కూటమిలో భాగమైన కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ పార్టీల మధ్య విభేదాలు తలెత్తాయి. దాంతో ఇరుపార్టీలు వేరువేరుగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించాయి. అంతేకాకుండా ఎన్నికల ప్రచారాల సమయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆప్‌పై పలు ఆరోపణలు చేశారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఇండియా కూటమికి ప్రాముఖ్యం తగ్గిపోయిందంటూ ఆప్ సహా కూటమి నేతలు అసహనం వ్యక్తంచేశారు. దీనివల్ల ఆగ్రహానికి గురైన ఒమర్‌అబ్దుల్లా కలసికట్టుగా లేకపోతే కూటమికి ముగింపు పలకాలంటూ వ్యాఖ్యానించారు. కేంద్రంలోని ఎన్డీయే సర్కారును గద్దె దించడమే లక్ష్యంగా ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి ఇండియా కూటమిగా ఏర్పడ్డాయి.

ఎన్నికల సమయంలో స్థానిక పార్టీలు బలంగా ఉన్న ప్రాంతాల్లో కాంగ్రెస్ పోటీ చేయకుండా వారికే అవకాశం ఇవ్వాలనే ఒప్పందంతో ఈ కూటమి ఏర్పడింది.

కాగా ఆప్ అధికారంలో ఉన్న దిల్లీలో తమకు ఎక్కువ సీట్లు ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అయితే అప్పటికే జరిగిన లోక్‌సభ ఎన్నికలు, మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పరాజయాన్ని ఎదుర్కోవడంతో ఆప్ దానికి అంగీకరించలేదు. దీంతో రెండు కూటమి పార్టీలు ఒంటరి పోరుకు సిద్ధమయ్యాయి.

## ఢిల్లీ ఎన్నికల ఫలితాలు రేవంత్ రెడ్డికి గుణపాఠం

హైదరాబాద్: ఢిల్లీ ఎన్నికల ఫలితాలు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గుణపాఠమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. ఏబీఎన్‌తో రఘునందన్ రావు మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్‌కు దమ్ము ఉంటే 76 అసెంబ్లీ 12 పార్లమెంట్‌ల పరిధిలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయడం లేదో చెప్పాలని అన్నారు. ఢిల్లీ ఎన్నికలకు కేటీఆర్‌కు ఏం సంబంధమని ప్రశ్నించారు. కేటీఆర్‌కు కాంగ్రెస్ మీద అంత ప్రేముంటే బీఆర్ఎస్‌ను కాంగ్రెస్ పార్టీలో మెర్జ్ చేయాలని సూచించారు.

రాబోయే రోజుల్లో బీజేపీ సత్తా ఏంటో తెలుస్తోందని అన్నారు. మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేసే మొహం లేని వాళు మాట్లాడితే తాము స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. కేటీఆర్ గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత బెటర్ అని చెప్పారు. ఢిల్లీ ఎన్నికల్లో రాహుల్ గాంధీకి గాడిదగుడ్డు వచ్చిందని ఎద్దేవా చేశారు. లోకల్ బాడి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఢిల్లీ ఫలితాలే పునరావృతం అవుతాయని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు.

**అవినీతి సామ్రాజ్యం హస్తినలో కూలింది: ఎంపీ డీకే అరుణ...** ఢిల్లీ ఎన్నికల ఫలితాలు తెలంగాణ రాజకీయాలను ప్రభావితం చేయబోతున్నాయని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ తెలిపారు. 27 ఏళ్ల తర్వాత అవినీతి సామ్రాజ్యం హస్తినలో కూలిందని అన్నారు. మార్పు కోసమే ఢిల్లీ ప్రజలు బీజేపీని ఆదరించారని ఉద్ఘాటించారు. తాను ఢిల్లీలో పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నానని తెలిపారు. దేశ రాజధానిలో మంచినీళ్లు దొరికే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ బీజేపీ అధ్యక్ష రేసులో తాను ఉండొచ్చని.. అది హై కమండ్ నిర్ణయమని చెప్పారు. రేవంత్ రెడ్డికి లోకల్ బాడి ఎన్నికల భయం పట్టుకుందని విమర్శించారు. అందుకే ముందు జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు తర్వాత సర్పంచ్ ఎన్నికలు అంటున్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం ఎదురు అవుతోందని ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com